RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 72 | ఏప్రిల్ 01 బుధవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 72 | April 01 Wednesday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


వృక్షశాస్త్రంలో దాసరి రఘు కి డాక్టరేట్ డిగ్రీ ప్రదానం 2

## నలంద శీతలా మాత ఆలయంలో తొక్కిసలాట

**ఎనిమిది మంది మహిళా భక్తుల మృతి**



పాట్నా జనసంఘర్షణ

బీహార్‌లోని నలంద జిల్లాలో విషాదం నెలకొంది. మఘ్రా గ్రామంలోని ప్రసిద్ధ శీతలా మాత ఆలయం వద్ద మంగళవారం జరిగిన ఘోర తొక్కిసలాటలో ఎనిమిది మంది మహిళా భక్తులు ప్రాణాలు కోల్పోయారు. చైత్ర మాసంలోని చివరి మంగళవారం కావడంతో, అమ్మవారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా మహిళా భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడం, తగిన స్థాయిలో భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో ఒక్కసారిగా తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మరో 12 మందికి పైగా తీ(

➤ మిగతా 2వ పేజిలో..

## హైదరాబాద్‌లో దివంగత జయలలిత నివాసం సీజ్

**భారీగా పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిలు**

హైదరాబాద్ జనసంఘర్షణ:
తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలితకు చెందిన హైదరాబాద్‌లోని నివాసాన్ని జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం సీజ్ చేశారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న ఈ భవనానికి సంబంధించి గత కొన్నేళ్లుగా ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. 2017 నుంచి సుమారు రూ. 83 లక్షల మేర పన్ను పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై ఫిబ్రవరిలోనే జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ, జయలలిత వారసుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఏఎంసీ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లి జీం4 అంతస్తుల ఈ భవనానికి తాళాలు వేశారు.

➤ మిగతా 2వ పేజిలో..

## తడిసిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేయండి

**అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**



హైదరాబాద్ జనసంఘర్షణ :
అకాల వర్షాల వల్ల నష్టపోయిన పసుపు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని మార్కెట్ యార్డు అధికారులను ఖచ్చితంగా ఆదేశించారు. ముఖ్యంగా వర్షానికి తడిసిన పసుపును ఎటువంటి కోతలు లేకుండా, పూర్తి తూకంతో కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. నిజామాబాద్ మార్కెట్‌కు ప్రస్తుతం భారీగా పసుపు వస్తోందని, ఇప్పటికే దాదాపు 27,400 బస్తాల పసుపు యార్డుకు చేరిందని ఆయన వివరించారు. వర్షాల వల్ల సుమారు 70 నుండి 80 కుప్పలు తడిసి దాదాపు 40 మంది రైతులు నష్టపోయినట్లు గుర్తించామని, అటువంటి రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పసుపు పంట రక్షణ కోసం మార్కెట్ యార్డుల్లో 1,500 టార్పాలిన్లను పంపిణీ చేసేందుకు

➤ మిగతా 2వ పేజిలో..

# రేపటి నుంచి గ్రామసభలు

**ప్రజా పాలనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష**



హైదరాబాద్ జనసంఘర్షణ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రజా ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రకటించారు. మంగళవారం సాయంత్రం ప్రజాభవన్ నుండి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సభలు ఒకే పద్ధతిలో జరిగేలా చూడాలని, సభ ప్రారంభంలో ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించి, ఆపై ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు కూలంకషంగా వివరించాలని సూచించారు. ముఖ్యంగా రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలను గ్రామసభల్లో చదివి వినిపించాలని, జూన్ 2 నుంచి అమలు కానున్న అందరికీ జీవిత బీమా పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న

➤ మిగతా 2వ పేజిలో..

## హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆంక్షలు

**అంతర్జాతీయ నౌకలపై భారీ టోల్ విధింపు**



టెహ్రాన్
ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై పట్టు బిగించే దిశగా ఇరాన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ వ్యూహాత్మక సముద్ర మార్గం గుండా ప్రయాణించే వాణిజ్య నౌకల నుండి భారీ మొత్తంలో టోల్ వసూలు చేసేందుకు ఆ దేశ పార్లమెంట్ భద్రతా కమిటీ పచ్చజెండా ఊపింది. కొత్తగా రూపొందించిన 'హర్మూజ్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక' ప్రకారం, ఇకపై ఈ జలసంధిని దాటే ప్రతి చమురు ట్యాంకర్‌పై గరిష్ఠంగా రూ. 18.90 కోట్ల వరకు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. సముద్ర భద్రతను మెరుగుపరచడం మరియు నౌకాయాన నియంత్రణను కట్టుదిట్టం చేయడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ఉద్దేశమని ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఇప్పటికే ఈ నూతన విధానం కింద సుమారు 26 నౌకలు అవసరమైన

➤ మిగతా 2వ పేజిలో..

## ప్రజా సమస్యలను పక్కనపెట్టి అసెంబ్లీ సమయం వృథా

**కాంగ్రెస్ సర్కార్‌పై ధ్వజమెత్తినహరీష్ రావు**



హైదరాబాద్ జనసంఘర్షణ :
రాష్ట్ర శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సమయాన్ని వృథా చేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. మంగళవారంజరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీని అధికార పక్షం తమ ఇష్టానుసారం నడిపిందని ఆరోపించారు.

➤ మిగతా 2వ పేజిలో..

## బీజేపీలో చేరిన టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్

**బెంగాల్ ఎన్నికల బరిలో నిలిచే అవకాశం**

న్యూఢిల్లీ జనసంఘర్షణ
భారత టెన్నిస్ దిగ్గజం, 18 గ్రాండ్ స్లామ్ టైటిల్స్ విజేత లియాండర్ పేస్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. మంగళవారం న్యూఢిల్లీలోని భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, సుకాంత మజుందార్ సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ

➤ మిగతా 2వ పేజిలో..

# రేపటి నుంచి గ్రామసభలు

**మొదటిపేజీ తరువాయి..** పాలు, రాగిజావా వంటి పౌష్టికాహార పథకాలతో పాటు, ఇంటర్ విద్యార్థులకు కొత్తగా ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం గురించి ప్రతి ఒక్కరికీ తెలిసేలా ప్రచారం చేయాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల వివరణలో సాంస్కృతిక, పౌర సంబంధాల శాఖల సహకారం తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తోందని, ఏ గ్రామానికి ఎంత నిధులు అందాయో ఆయా గ్రామసభల్లో బహిరంగంగా ప్రకటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా మౌలిక సదుపాయాలు, సేవా రంగాల అభివృద్ధిని కూడా సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పక్కనపెట్టి అసెంబ్లీ సమయం వృథా

**మొదటిపేజీ తరువాయి..** కేరళ ఎన్నికల ప్రచారం కోసం అసెంబ్లీని ముందే వాయిదా వేయడంపై ఆయన మండిపడుతూ, కాంగ్రెస్ పార్టీకి కేరళ ఎన్నికలు ముఖ్యం కావచ్చు కానీ, బీఆర్ఎస్‌కు మాత్రం తెలంగాణ ప్రజల సమస్యలే ప్రధానమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనల పేరుతోనో, మంత్రుల సన్నద్ధత పేరుతోనో సభను గంటల తరబడి వాయిదా వేస్తూ విలువైన సమయాన్ని వృథా చేశారని ఆయన దుయ్యబట్టారు. సభలో ముఖ్యమంత్రి మరియు ఇతర సభ్యులు ఉపయోగించిన భాషపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అనాగరిక వ్యాఖ్యలు చేసిన వారిని ఎథిక్స్ కమిటీకి ఎందుకు రిఫర్ చేయడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేసినా, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని ఆయన హెచ్చరించారు.
కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్ చేసిన వ్యాఖ్యలను కూడా హరీష్ రావు ఈ సందర్భంగా తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం తెలంగాణకు వరప్రదాయిని అని గతంలో కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టుతో పాటు అనేకమంది ప్రముఖులు ప్రశంసించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వేలో కూడా కాళేశ్వరం వల్ల సాగు భూమి పెరిగిందని పేర్కొన్నారని, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సైతం సభలో ఇదే విషయాన్ని అంగీకరించారని తెలిపారు. కేవలం బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లడానికే ఇప్పుడు కాళేశ్వరం గురించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం రూ. 50 కోట్లు కేటాయిస్తే మరో రెండు లక్షల ఎకరాలకు నీరు అందుతుందని, దీనిపై ఎన్ని లేఖలు రాసినా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షల కోసం రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టవద్దని హరీష్ రావు విజ్ఞప్తి చేశారు.

# బీజేపీలో చేరిన టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్

**మొదటిపేజీ తరువాయి..** ఎన్నికల వేళ పేస్ పార్టీలో చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా జరగనున్న ఈ ఎన్నికల్లో ఆయన పోటీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కోల్‌కతా వంటి పట్టణ ప్రాంతాల్లో పేస్‌కు ఉన్న విశేష ప్రజాదరణ, క్లీన్ ఇమేజ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఎగువ మధ్య తరగతి ఓటర్లను మరియు క్రీడాభిమానులను ఆకర్షించాలని బీజేపీ భావిస్తోంది. ఈ సందర్భంగా లియాండర్ పేస్ మాట్లాడుతూ, తనకు ఈ అవకాశం కల్పించిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాల్లోకి రావడం కేవలం టికెట్ కోసం కాదని, ఇదొక సామాజిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. 'ఖేలో ఇండియా' ద్వారా దేశ యువతకు సేవ చేసే అవకాశం దక్కిందని, ప్రధాని మోదీ యువతకు ఇస్తున్న ప్రాధాన్యతను స్ఫూర్తిగా తీసుకుని అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం బెంగాల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న పేస్, తన క్రీడా జీవితంలో ఎన్నో అద్భుతమైన మైలురాళ్లను అందుకున్నారు.
టెన్నిస్ చరిత్రలో అత్యంత విజయవంతమైన డబుల్స్ ఆటగాళ్లలో ఒకరైన పేస్, ఏడు ఒలింపిక్స్‌లలో పాల్గొన్న అరుదైన ఘనతను కలిగి ఉన్నారు. 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించి, టెన్నిస్‌లో ఈ మెడల్ గెలుచుకున్న తొలి ఆసియా క్రీడాకారుడిగా చరిత్ర సృష్టించారు. ఫ్రెంచ్, యూఎస్ ఓపెన్ లలో మూడుసార్ల చొప్పున, ఆస్ట్రేలియా, వింబుల్డన్ టైటిల్స్‌ను ఒకసారి చొప్పున గెలుచుకోవడమే కాకుండా, 10 మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్స్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. మహేష్ భూపతితో కలిసి ప్రపంచవ్యాప్తంగా అనేక విజయాలు సాధించిన పేస్, ఇప్పుడు రాజకీయ మైదానంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మే 4న వెలువడే బెంగాల్ ఎన్నికల ఫలితాలు ఆయన రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

# వృక్షశాస్త్రంలో దాసరి రఘు కి డాక్టరేట్ డిగ్రీ ప్రదానం

**బోధన్ : మార్చి 31 జన సంఘర్షణ**
తెలంగాణ యూనివర్సిటీ, వృక్షశాస్త్ర విభాగంలో వర్ని మోడల్ స్కూల్ అధ్యాపకుడు దాసరి రఘు కు మంగళవారం జరిగిన వైవా-వోస్ కార్యక్రమంలో డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేయడం జరిగింది. ఆచార్య బి. విద్యావర్ధిని పర్యవేక్షణలో పరిశోధకుడు రఘు "ఎన్హాన్స్మెంట్ ఆఫ్ క్వాంటిటెటివ్, క్వాలిటీటివ్ యీల్డ్, వయాబిలిటీ అండ్ లో జర్మినేషన్ రేట్ ఇన్ క్లియోమ్ విస్కోసా అండ్ క్లియోమ్ గైనండ్రా బై అప్లికేషన్ అఫ్ బ్రాస్సినోస్టిరైడ్స్" అనే అంశం పై పరిశోధక గ్రంథాన్ని తెయు కు సమర్పించారు. దీనికి కేంద్రియ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ కి చెందిన ఆచార్య రాహుల్ కుమార్ ఎక్స్టెర్నల్ ఎగ్జామినర్ గా వ్యవహరించారు. కాగా రఘు తన పరిశోధన ఫలితాలను వివరించారు. రఘు పరిశోధన ఫలితాలపై సంతృప్తి చెంది డాక్టరేట్ అవార్డును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డా. ఎ. ఎ. హలీమ్ ఖాన్, తెయు సైన్స్ డీన్ ఆచార్య సంపత్ కుమార్, చైర్పర్సన్, బివోఎస్ డా. ఎమ్. అరుణ, డా. దేవరాజు శ్రీనివాస్, డా. వి. జలంధర్, పరిశోధక విద్యార్థులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# నలంద శీతలా మాత ఆలయంలో తొక్కిసలాట

**మొదటిపేజీ తరువాయి..** గాయపడ్డారు. ఘటన జరిగిన సమయంలో పదుల సంఖ్యలో మహిళలు స్పృహతప్పి పడిపోవడం అక్కడి వారిని కలచివేసింది. స్థానిక అధికారుల నిర్వహణ లోపం వల్లే ఈ ఘోరం జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. భక్తుల రద్దీని నియంత్రించడంలో విఫలం కావడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ పరిసరాలు ఇరుకుగా ఉండటం, భక్తులు వేల సంఖ్యలో రావడంతో అంబులెన్స్‌లు కూడా ఘటనా స్థలానికి చేరుకోవడానికి ఇబ్బంది పడ్డాయి. దీంతో స్థానికులే బాధితులను చేతులతో ఎత్తుకుని అంబులెన్స్‌ల వరకు తీసుకెళ్లి ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారికి బీహార్ షరీఫ్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో మఘ్రూ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# హైదరాబాద్‌లో దివంగత జయలలిత నివాసం సీజ్

**మొదటిపేజీ తరువాయి..** మార్చి 31 వరకు ప్రభుత్వం కల్పించిన వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓటీఎస్) పథకం కింద లభించే రాయితీలు పోను, మొత్తం రూ. 82,91,822 బకాయిలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. గతంలో ఈ భవనాన్ని వాణిజ్య అవసరాల కోసం (ప్రైవేట్ కార్యాలయంగా) వినియోగించేవారు. అయితే, 2017 నుంచి దీనిని నివాసంగానే వాడుతున్నామని, కాబట్టి దీనిని రెసిడెన్షియల్ కేటగిరీ కిందకు మార్చాలని జయలలిత మేనల్లుడు దీపక్ జయకుమార్ గతంలో జీహెచ్ఎంసీని కోరారు. అయినప్పటికీ పన్ను చెల్లింపుల్లో జాప్యం జరగడంతో అధికారులు చర్యలు చేపట్టారు. నగరంలో పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించిన జీహెచ్ఎంసీ, గడువు ముగియనున్న నేపథ్యంలో బకాయిలు ఉన్న ప్రధాన కట్టడాలపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఉన్న ఈ చారిత్రక ప్రాధాన్యత కలిగిన భవనాన్ని సీజ్ చేయడం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

# హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆంక్షలు

**మొదటిపేజీ తరువాయి..** అనుమతి కోడ్‌లను పొంది ప్రయాణించినట్లు సమాచారం.అయితే, అంతర్జాతీయ జలమార్గాలపై ఇరాన్ తీసుకున్న ఈ ఏకపక్ష నిర్ణయంపై ప్రపంచ దేశాల నుండి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛను హరించే ఇలాంటి చర్యలను అంగీకరించబోమని పలు దేశాలు హెచ్చరించాయి. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్క్ రుబియో ఈ చర్యను తీవ్రంగా తప్పుబట్టగా, జీ7 దేశాలు సైతం ఇరాన్ వైఖరిని ఖండించాయి. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణాకు భంగం కలగకుండా తక్షణమే అంతర్జాతీయ సమాజం స్పందించాలని అవి సూచించాయి. ఈ పరిణామాల వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# తడిసిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేయండి

**మొదటిపేజీ తరువాయి..** బిడ్డింగ్ ప్రక్రియ పూర్తి చేశామని, రైతులకు చెల్లింపులు కూడా సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. మేలు రకం పసుపునకు ప్రభుత్వం ఖరారు చేసిన ధరను చెల్లిస్తున్నామని, కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకవేళ రైతులను ఇబ్బంది పెడితే మార్కెట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అకాల గాలులు, వర్షాల నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని, మార్కెట్లలో సౌకర్యాల విషయంలో ఎక్కడా రాజీ పడబోమని ఆయన స్పష్టం చేశారు.

## పిఆర్సీ,డిఎలు విడుదల చేయాలి

**లేకుంటే టెన్త్ స్పాట్ బహిష్కరిస్తాం**

**పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్**

**నల్లగొండ, మార్చి31 :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే పీఆర్సీ, డీఏలను తక్షణమే విడుదల చేయాలని, అదేవిధంగా కులగణన రెమ్యూనరేషన్ ఇవ్వలేదని, కంటి తూడుపుగా గత సంవత్సర ఎస్ఎస్సీ స్పాట్ వాల్యూయేషన్ డబ్బులు విడుదల చేస్తున్నారని, అలా కాకుండా పూర్తి స్థాయిలో అందజేయాలని లేని పక్షంలో పదో తరగతి స్పాట్ బహిష్కరిస్తామని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్ అన్నారు. నల్లగొండతో పాటు పలు ప్రాంతాలోని పాఠశాలలో ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ సన్మానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంగళవారం రాత్రి వరకు పీఆర్సీ, డీఏ, ఉపాధ్యాయులకు, పెన్షనర్స్‌కు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏప్రిల్ 1 నుండి ప్రారంభమయ్యే పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. కుల గణన చేసిన సర్వే రెమ్యూనరేషన్స్ సహితం ఇంతవరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నేటికి అమలు చేయకపోవడంతో తీవ్ర మనోవేదనలో ఉన్నారన్నారు. ఆయా కార్యక్రమాల్లో పీఆర్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు డివిఎస్ ఫణికుమార్, నల్లగొండ ఎంఈఓ కత్తుల అరుంధతి, పీఆర్టీయూ నల్లగొండ మండల అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల భాస్కర్ గౌడ్, బొడ్డు నాగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నగరంలో కల్తీ నూనె దందా

**వాడేసిన నూనె ప్యాకెట్లలో నింపి అమ్మకం**


**ముఠాను గుర్తించి పట్టుకున్న పోలీసులు**

**హైదరాబాద్, మార్చి31 :** హైదరాబాద్‌లో కల్తీ వంట నూనె దందా తీవ్ర కలకలం రేపుతోంది. హైటెక్ సిటీలో కల్తీ వంట నూనె విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న సమాచారం వెలుగులోకి వచ్చింది. హోటళ్లలో వాడిన వంటనూనెను కిలోకు రూ.20కు సేకరిస్తున్న ముఠా... దాన్ని వీధి వ్యాపారులకు రూ.70కు అమ్ముతున్నట్లు బయటపడింది. లాభాల కోసం ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ముఠా గుట్టు బయటపడింది. నాచారం ప్రాంతంలో శుద్ధి పేరుతో మళ్లీ ప్యాకెట్లలో నింపుతూ దందా చేస్తున్నట్లు గుర్తించారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన మాదాపూర్ పోలీసులు... కల్తీ నూనె సేకరిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేశారు. మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లోని రెస్టారెంట్ల నుంచి వాడిన నూనెను సేకరించి.. కర్ణాటక రిజిస్ట్రేషన్ ఆటోలో వందల లీటర్లు తరలిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# పంట మార్పిడిపై అవగాహన సదస్సు

బోధన్ మార్చి 31 జన సంఘర్షణ

కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ ఆధ్వర్యంలో రైతులకు పంట మార్పిడిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన, లాభదాయకమైన పంటల సాగుపై అవగాహన, పంటల వైవిధ్యకరణపై అవగాహన వంటి అంశాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డా.టి.సుప్రజ, సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి కె.వి.కె మాట్లాడుతూ... రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా, స్థానిక వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ, లాభదాయక పంటల సాగు చేపట్టాలని సూచించారు. వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగలిగే పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు, వాణిజ్య పంటలు రైతులకు మంచి ఆదాయం అందించే అవకాశమున్న పంటలుగా వివరించారు. డా. కె. పవన్ చంద్ర రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి, ప్రాంతీయ చెరకు, వరి పరిశోధన కేంద్రం, రుద్రూర్, మాట్లాడుతూ.... వ్యవసాయంలో స్థిరమైన ఆదాయం సాధించాలంటే సంప్రదాయ పద్ధతులతో పాటు ప్రాంతానుకూలమైన, మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలను రైతులు ఎంపిక చేసుకోవడం అవసరమని వివరించారు. పంటల మార్పిడి అంతర పంటల సాగు, మిశ్రమ పంటల సాగు ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడం, పురుగులు-రోగాల సమస్యలను తగ్గించుకోవడం, ఉత్పాదకతను పెంచుకోవడం సాధ్యమవుతుందని తెలియజేశారు. డా. కె. ఇందూధర్ రెడ్డి, సేద్య విభాగం శాస్త్రవేత్త మాట్లాడుతూ... రైతులకు పంటల ఎంపిక, విత్తనాల వినియోగం, ఎరువుల యాజమాన్యం, నీటి పొదుపు పద్ధతులు, మార్కెట్ ఆధారిత పంటల ప్రణాళిక వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. వ్యవసాయ రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల వైవిధ్యకరణ వైపు అడుగులు వేయడం కాలానుగుణ అవసరమని పేర్కొన్నారు. వైవిధ్యకరణ ద్వారా వ్యయభారం తగ్గించుకోవడం, నేల సారాన్ని కాపాడుకోవడం, పురుగు వ్యాధుల సమస్యలను తగ్గించుకోవచ్చని తెలిపారు. సాయి కృష్ణ, మండల వ్యవసాయ అధికారి,రుద్రూర్ మాట్లాడుతూ... రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేసి పంటకు



మంచి ధర పొందవచ్చని తెలియజేశారు. అనంతరం రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై పలు సందేహాలను శాస్త్రవేత్తలతో చర్చించారు. అనంతరం పంట మార్పిడిపై రైతుల అభిప్రాయాన్ని శాస్త్రవేత్తలు సేకరించారు. ఈ కార్యక్రమంలో డా. కె. పవన్ చంద్ర రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త మరియు అధిపతి, ప్రాంతీయ చెరకు, వరి పరిశోధన కేంద్రం, రుద్రూర్, డా.టి.సుప్రజ, సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి, కె.వి.కె డా. కె. ఇందూధర్ రెడ్డి, సేద్య విభాగం శాస్త్రవేత్త, కె.వి.కె సాయి కృష్ణ, మండల వ్యవసాయ అధికారి,రుద్రూర్ రైతులు పాల్గొన్నారు.

# 4 లేబర్ కోడులను వెనక్కి తీసుకోవాలి

**❑ సిపిఎం ప్రజాసంఘాల ధర్నా.**

బోధన్ : మార్చి 31 జన సంఘర్షణ

నేటి నుంచి దేశవ్యాప్తంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడులను అమలు జరపటానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించటాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బోధన్ లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్లే కార్డులను ప్రదర్శిస్తూ నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ... అనేక దశాబ్దాలుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ, పెట్టుబడిదారులకు కార్పొరేట్ కంపెనీలకు కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడులను తీసుకువచ్చి వాటిని రేపటినుండి అమలు జరపాలని నిర్ణయించారని దీన్ని తీవ్రంగా



వ్యతిరేకిస్తున్నట్లు ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకొని కార్మిక చట్టాలను అమలు జరపాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ కేరళ రాష్ట్రంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోర్టులను తమ రాష్ట్రంలో అమలు జరపమని నిర్ణయించి అసెంబ్లీలో తీర్మానం చేయటం జరిగిందని. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా అసెంబ్లీలో పేపర్ కోడ్లను వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని వాటిని అమలు జరపకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ కాలంలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటంలోకి రావాల్సి వస్తుందని వారు అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులతో పాటు రైతాంగాన్ని ప్రజలను నష్టపరిచే విద్యుత్తు సవరణ బిల్లును తీసుకురావడం కూడా సరైనది కాదని దాన్ని వెనక్కి తీసుకోవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, వికలాంగుల సంఘం జిల్లా కార్యదర్శి వేషాల గంగాధర్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏం గంగాధరప్ప ,పి.వెంకటేష్, సిఐటియు జిల్లా కోశాధికారి నన్నే సాబ్, నాయకులు పోశెట్టి, గోపి, కుమారస్వామి తదితరులతో పాటు వివిధ సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగులో లేబర్ కోడులను వ్యతిరేకిస్తూ బోధన్ లో సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగులో లేబర్ కోడులను వ్యతిరేకిస్తూ బోధన్ లో సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

# బోధన్ పట్టణంలో హనుమాన్ జయంతి ర్యాలీ సందర్భంగా ఆర్గనైజర్లతో సమన్వయ సమావేశం నిర్వహించిన పోలీస్ కమిషనర్

**❑ డి.జె వాడకం పూర్తిగా నిషేధం**

బోధన్ మార్చి 31 జన సంఘర్షణ

బోధన్ పట్టణంలోని హనుమాన్ జయంతి నిర్వహణ సందర్భముగా మంగళవారం రోజున ఉదయం బోధన్ లయన్స్ క్లబ్ యందు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పీ.ఎస్, హనుమాన్ జయంతి శోభాయాత్ర ర్యాలీ నిర్వహకులతో వివిధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాటించ వలసిన నియమ నిబంధనలు క్షుణ్ణంగా చర్చించడం జరిగింది. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో ఉత్సాహం జరుపుకోవాలని ర్యాలీ పూర్తిగా ఆధ్యాత్మికముగా నిర్వహించుకోవాలని అదే సమయంలో ఇతరులకు మరియు సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. ఎవరైనా సరే చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. హనుమాన్ జయంతి శోభాయాత్రను గత సంవత్సర



క్రితం జరిగిన మాదిరిగానే అనుమతి గలదు అదే రూట్ లో నిర్వహించాలి. కొత్త రూట్‌లకు అనుమతి ఎలాంటిది లేదు. పాత రూటు ప్రకారమే అనుమతి గలదు. నిర్వాహకులు తప్పనిసరి వాలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలి. వారికి ముందుగానే ర్యాలీకి సంబంధించినటువంటి సూచనలు తెలియజేయాలి అన్నారు. డిజె సౌండ్ సిస్టం పూర్తిగా నిషేధమని తెలియజేశారు. డ్రోన్లు వాడకం నిషేధమని తెలిపారు. ఈ సమావేశంలో ర్యాలీ ఆర్గనైజర్లు వారి సందేహాలు సలహాలు పోలీస్ కమిషనర్ స్వీకరించారు. ఈ సమావేశంలో బోధన్ ఏసిపి , పి. శ్రీనివాస్ , బోధన్ ఎస్. హెచ్. ఓ వెంకట్ నారాయణ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం , సిఐలు , ఎస్సైలు, హిందూ ధర్మ ప్రచార మండలి ప్రవీణ్ గుప్తా, ఆర్గనైజషన్ గోపి, విశ్వ హిందూ పరిషత్ శ్రీ హరి కృష్ణ రెడ్డి, మారుతీ మందిరం పూజారి ప్రవీణ్ మహారాజ్, లయన్స్ క్లబ్ , బజరంగ్దళ్, ఆర్య సమాజ్ తదితరులు పాల్గొన్నారు.

## భిర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి చికిత్స

మార్చ్ 31( జనసంఘర్షణ)

సహాయకులు సతీష్ 38 మందికి ఉచిత కంటి పరీక్షలు చేయగా అందులో నుండి 16 మంది పేషంట్స్‌ని కంటి ఆపరేషన్ కొరకు బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు సతీష్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలె రమేష్, జోన్ చైర్మన్ కొట్టురి సంతోష్, హన్మంతు, రాజశేఖర్ పటేల్ గ్రామప్రజలు పాల్గొన్నారు.



## కాలభైరవుడిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్...

రామారెడ్డి:మార్చ్ 31 (జనసంఘర్షణ)

మండల కేంద్రంలోని ఇసన్నపల్లి రామారెడ్డి మధ్యలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కాలభైరవ స్వామిని మంగళవారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు చేసి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం కాలభైరవ స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామి వారి చిత్ర పటంతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాస్, సంజీవ్, నర్సారెడ్డి, ప్రసాద్, రెడ్డి మల్లేష్, తిరుపతి, రవి, శ్రీకాంత్,రాజనర్సు, లింగం,రామస్వామి, మహిపాల్, అంజయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



## పేదల కోసమే మెగా ఉచిత వైద్య శిబిరం..

బిక్కనూరు:మార్చ్ 31 (జనసంఘర్షణ)

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రం ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన ఆరుగురు డాక్టర్లు పాల్గొని, పలు రకాల వ్యాధులతో బాధపడుతున్న 183 మంది రోగులను పరీక్షించి, రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన మెగా హెల్త్ కు క్యాంప్ ను సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ మెగా హెల్త్ క్యాప్ పేదలకు మంచి అవకాశం అని, పలు రకాల వ్యాధులతో బాధపడుతున్న రోగులు ఈ యొక్క మెగా హెల్త్ క్యాంపును ఉపయోగించుకోవాలని, ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి ప్రత్యేక వైద్యులు మెడిసిన్ డాక్టర్ రుతిక, ఆబ్జెక్టిక్స్ అండ్ గైనలజీ డాక్టర్ దీప్తి, పీరియాట్రిక్స్ శ్రీలేఖ, ఆర్థోపెడిక్స్ డాక్టర్ అనూష ఫాతిమా, డెంటల్ డాక్టర్ అనిల్, ఆప్తామాలజీ డాక్టర్ వర్షిక రెడ్డి, అలాగే ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, వైద్య సిబ్బంది, నాయకులు పాముల లింబాద్రి, బల్యాల సుదర్శన్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## బీబీపేట మండలంలో “అర్రైవ్ అలివ్” అవగాహన కార్యక్రమం

బీబీపేట్,మార్చి 31 ( జన సంఘర్షణ)

కామారెడ్డి జిల్లా, బీబీపేట్ మండలం లోని ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్ గ్రామాల్లో మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే “అర్రైవ్ అలివ్” కార్యక్రమం బీబీపేట్ ఎస్ఐ కొండ విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు పాటించడం ఎంత ముఖ్యమో వివరించారు. హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, ఓవర్ స్పీడ్ చేయకుండా జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ ప్రజలు, యువకులు, వాహనదారులు పాల్గొన్నారు.




## వృక్షశాస్త్రంలో దాసరి రఘు కి డాక్టరేట్ డిగ్రీ ప్రదానం

బోధన్ : మార్చి 31 జన సంఘర్షణ

తెలంగాణ యూనివర్సిటీ, వృక్షశాస్త్ర విభాగంలో వర్ని మోడల్ స్కూల్ అధ్యాపకుడు దాసరి రఘు కు మంగళవారం జరిగిన వైవా-వోస్ కార్యక్రమంలో డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేయడం జరిగింది. ఆచార్య బి. విద్యావర్ధిని పర్యవేక్షణలో పరిశోధకుడు రఘు “ఎన్హాన్స్మెంట్ ఆఫ్ క్వాంటిటెటివ్, క్వాలిటీటివ్ యీల్డ్, వయాబిలిటీ అండ్ లో జర్మినేషన్ రేట్ ఇన్ క్లియోమ్ విస్కోసా అండ్ క్లియోమ్ గైనండ్రా బై అప్లికేషన్ అఫ్ బ్రాస్సినోస్టిరైడ్స్” అనే అంశం పై పరిశోధక గ్రంథాన్ని తెయు కు సమర్పించారు. దీనికి కేంద్రియ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ కి చెందిన ఆచార్య రాహుల్ కుమార్ ఎక్స్టెర్నల్ ఎగ్జామినర్ గా వ్యవహరించారు. కాగా రఘు తన పరిశోధన ఫలితాలను వివరించారు. రఘు పరిశోధన ఫలితాలపై సంతృప్తి చెంది డాక్టరేట్ అవార్డును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డా. ఎ. ఎ. హలీమ్ ఖాన్, తెయు సైన్స్ డీన్ ఆచార్య సంపత్ కుమార్, చైర్పర్సన్, బివోఎస్ డా. ఎమ్. అరుణ, డా. దేవరాజు శ్రీనివాస్, డా. వి. జలంధర్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.




# ఇల్లందులో గ్యాస్ సెగలు

**❑ బుకింగ్ లేదు.. కానీ డెలివరీ అయిపోయిందంట!**

ఇల్లందు మార్చ్ 31 (జన సంఘర్షణ)

ఇల్లందులోని ఒక గ్యాస్ ఏజెన్సీలో వినియోగదారులు సిలిండర్లు బుక్ చేయకపోయినా, డెలివరీ అయినట్లు ఫోన్లకు మెసేజ్లు వస్తుండటంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వీటిని బ్లాక్ మార్కెట్లో రూ. 1,200 నుండి రూ. 1,500 వరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై వివరణ కోరిన వినియోగదారుల పట్ల సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రభుత్వాల నిర్లక్ష్యం – సమన్వయ లోపం బీసీలకు శాపం కారాదు!

- **బీసీల పట్ల సానుకూలంగా వ్యవహరించాలి!!**
- **బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాకే నియోజకవర్గాల పునర్విభజనకు శ్రీకారం చుట్టాలి!**
- **బీసీల ఆత్మ గౌరవానికి - భద్రతకు "బీసీ రక్షణ చట్టం"తేవాలి!**
- **ఏప్రిల్ 26 నుండి చేపట్టే జన గణనలో బీసీ కుటుంబాలను లెక్కించాలి!!**
- **రాజ్యాంగ బద్ధమైన హక్కుల సాధనకై బీసీలు పిడికిలి బిగించి పోరాడాల్సిందే!**
- **ఏప్రిల్లో నల్ల చొక్కాలు, నల్ల బ్యాడ్జీలతో నిరసనలు! కవులు, కళాకారులు, ఉద్యమకారులు, పాల్గొనాలని విజ్ఞప్తి.**
- **పొలాస నరేందర్ బీసీ సాధికారిత సంఘ ఇంచార్జీ ఉత్తర తెలంగాణ**



సిరిసిల్ల జిల్లా . మార్చ్ 31 . (జన సంఘర్షణ )
జనాభాలో 56.33 శాతం ఉన్న బీసీలపై రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలకు చిత్త శుద్ధి లేక నిర్లక్ష్యం వల్ల, స్వాతంత్ర్యం సిద్ధించి 79 ఏండ్లు అయినను స్వాతంత్ర్య ఫలాలు, రాజ్యాంగ ఫలాలు బీసీలకు అందక, బడ్జెట్లో బీసీ జనాభన నిధులు కేటాయింపు జరుగక బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్య, ప్రమోషన్లలో, ఉద్యోగ పరంగా, క్రీడల్లో వెనుకబడి పోతూ చివరికి కుల చేతి వృత్తులు సాగక బీసీల బ్రతుకులు చితికి పోతున్నాయని పొలాస నరేందర్ ఉత్తర తెలంగాణ జిల్లాల బీసీ సాధికారిత సంఘం ఇంచార్జీ మాట్లాడుతూ అన్నారు.

**2026-27 బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు తీరని అన్యాయం**

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్ రూ.3,24,234 కోట్ల నిధుల్లో 56.66 శాతం ఉన్న బీసీ సంక్షేమానికి కంటి తుడుపు చర్యగా కేవలం రూ.12,511కోట్ల నిధులు (3.85శాతం)కేటాయింపు ఎంతవరకు సమంజసమని, ఏటా 20 వేల కోట్ల చొప్పున 5 ఏండ్లకు లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని, చట్టబద్ధంగా బీసీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని, కుల చేతి వృత్తుల సంక్షేమంకై, యువతకు ఉపాధికై సరిపడు నిధులు కేటాయిస్తామని, కార్పొరేషన్లకు, ఫెడరేషన్లకు పాలకమండల్లను ఏర్పాటు చేస్తామని, విధ్యార్థులకు మంచి భవిష్యత్తును అందిస్తామని చెప్పి అందుకు సరిపడు నిధులు కేటాయించక పోవడం బీసీ వర్గాలకు నిరాశ కలిగించిందని నరేందర్ తన ఆవేదనను వ్యక్తం చేశారు.

**ఎన్నికల్లో రాజకీయంగా చేసిన వాగ్దానాలను చిత్త శుద్ధితో అమలు చేయాల్సిందే!**

బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి, పంచాయతీలో కేవలం 17 శాతం, మున్సిపల్, కార్పొరేషన్లో 31.4 శాతం రిజర్వేషన్లు కల్పించి చేతులు దులుపుకున్నారని, రిజర్వేషన్ల అమలుకు కోర్టులు అడ్డు చెబుతున్నాయని, కేంద్రం ఆమోదం తెలుపడం లేదన్న కుంటి సాకులు చూపి స్థానిక ఎన్నికలు జపడంతో బీసీలు తీవ్రంగా రాజకీయంగా నష్టపోయారని, 16 మంది మంత్రుల్లో జనాభన బీసీ సామాజికవర్గం నుండి కనీసం 7 గురు మంత్రులు ఉండాల్సింది, కానీ బీసీలు ముగ్గురు మంత్రులే ఉన్నారని, త్వరలో నియమించనున్న మరో ఇద్దరు మంత్రుల్లో బీసీలనే నియమించాలని, నామినేటెడ్ పోస్టుల్లో జనాభన బీసీలకు అవకాశాలు ఇవ్వాలని,చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నరేందర్ ప్రభుత్వాలను కోరారు.

**విద్యా మంత్రి సీఎం అయిన అరకొర నిధులే! బడుగుల చదువులకు భరోసా లేదు! నాణ్యమైన చదువులు సాగేదెలా!!**

రూ.3,24,234 కోట్ల బడ్జెట్లో విద్యకు కేవలం 26,108 కోట్లు మాత్రమే కేటాయింపు అన్యాయమని, విద్యా రంగానికి ప్రతి యేట 15 శాతం నిధులు కేటాయిస్తామన్నారని, విద్యకు కేటాయించిన అరకొర నిధులతో నాణ్యమైన విద్యను ఎలా అందిస్తారని, 2 లక్షల జ్యాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, స్కూటీల పథకం, విద్యా నిది రుణ పథకం బడ్జెట్లో ఊసే లేదనీ, విధ్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు సుమారు రూ. 8,500 కోట్లకు గాను కేవలం 4 వేల కోట్లు కేటాయిస్తే చదువులు ఎలా కొనసాగుతాయని, మహాత్మా జ్యోతిరావు పూలే విదేశీ విధ్యానిది పథకంలో విద్యార్థుల సంఖ్యను,నిధులను మరింత పెంచాలని నరేందర్ కోరారు.

**బీసీల ఆత్మ గౌరవానికి,భద్రతకు "బీసీ రక్షణ చట్టం"తేవాలి! జన గణనలో బీసీ కుటుంబాలను లెక్కించాలి!!**

బీసీల ఆత్మ గౌరవానికి, భద్రతకు భంగం కలగకుండా ఉండేందుకు "బీసీ రక్షణ చట్టం"తేవాలని ఈ చట్టం ద్వార బీసీలపై జరిగే దాడులు, బెదిరింపులు, వేధింపులు, కులం పేరుతో దూషణలు, సామాజిక బహిష్కరణలను అరికట్టవచ్చని, కేంద్రం దేశవ్యాప్తంగా చేపట్టుచున్న జన గణనలో బాగంగా రాష్ట్రంలో ఏప్రిల్ 26 నుండి చేపట్టే జనగణనలో బీసీ కుటుంబాలను లెక్కించాలని, కేంద్రంలో పెండింగ్లో నున్న బీసీ బిల్లులను ఆమోదించాలని, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాకనే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను పొలాస నరేందర్ కోరారు.

# హనుమాన్ జయంతి ర్యాలీ మార్గాన్ని స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

- **ర్యాలీ రూట్ మ్యాప్ పరిశీలన - అధికారులకు కీలక ఆదేశాలు**
- **శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని విజ్ఞప్తి.**


కామారెడ్డి. మార్చ్ 31 (జనసంఘర్షణ)
ఏప్రిల్ 02న హనుమాన్ జయంతి సందర్భంగా కామారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న శోభాయాత్ర మార్గం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర మంగళవారం స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షించారు. ర్యాలీ సజావుగా, శాంతియుత వాతావరణంలో జరిగేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో చర్చించి పలు కీలక సూచనలు చేశారు. వివిధ శాఖల అధికారులతో కలిసి ర్యాలీ సాగే రూట్ మ్యాప్‌ను పరిశీలించిన వారు, మార్గంలోని ప్రధాన కూడళ్లను సందర్శించి ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. అనంతరం ర్యాలీ నిర్వహణ ప్రతినిధులతో కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వేడుకలను క్రమశిక్షణతో నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ లు మాట్లాడుతూ, పట్టణంలోని ముఖ్య మార్గాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలు , సీసీటీవీల ద్వారా నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా భక్తులు , నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించి ఈ వేడుకలను ప్రశాంత వాతావరణంలో



జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఎస్.హెచ్.ఓ నరహరి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం మత్తులో స్టీరింగ్ పడితే ప్రాణాలు గాలిలో కలిసినట్టే

- **సీఐ సురేష్ సీరియస్ వార్నింగ్!**



ఇల్లందు మార్చ్ 31 (జన సంఘర్షణ)
మద్యం సేవించి వాహనం నడపడం కేవలం నేరం మాత్రమే కాదు, అది మీ కుటుంబాలను రోడ్డున పడేసే పెను ప్రమాదమని సీఐ సురేష్ హెచ్చరించారు. "మత్తులో డ్రైవింగ్ చేయడం అంటే మృత్యువును ఆహ్వానించడమే" అని ఆయన స్పష్టం చేశారు. గతంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాలను గుర్తు చేస్తూ, వాహనదారులు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సరదా కోసం తాగే మద్యం, నిండు ప్రాణాలను బలి తీసుకోకూడదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సీఐ కీలక సూచనలు: హెల్మెట్ ప్రాణ రక్షణ: బైక్ పై వెళ్లే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

నిబంధనలే కవచం: ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వారానే ప్రమాదాల నుండి బయటపడవచ్చు.

కఠిన చర్యలు: మద్యం తాగి వాహనం నడిపే వారిపై రాజీలేని విధంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గారు హెచ్చరించారు. మీ ప్రాణాలు మీ చేతుల్లోనే ఉన్నాయి. నిబంధనలు పాటించండి, సురక్షితంగా ఇంటికి చేరండి అని సీఐ సురేష్ ప్రజలకు పిలుపునిచ్చారు.

## పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యకరమైన సమాజానికి భూమిక

బోధన్ : మార్చి 31 జన సంఘర్షణ




తెలంగాణ విశ్వవిద్యాలయం ఎన్ఎస్సెస్ యూనిట్-3 ఆధ్వర్యంలో "100 రోజుల కార్యాచరణ ప్రణాళిక"లో భాగంగా క్యాంపస్ క్లీన్లీనెస్ డ్రైవ్‌ను ఈ రోజు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనిట్-3 ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఎన్. స్వామి నాయకత్వం వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్ఎస్సెస్ వాలంటీర్లు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమించారు. క్యాంపస్‌లోని వివిధ ప్రాంతాల్లో చెత్తను తొలగించడం, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా డా. ఎన్. స్వామి మాట్లాడుతూ, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యకరమైన జీవనానికి కీలకమని తెలిపారు. "100 రోజుల కార్యాచరణ ప్రణాళిక"లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఆయన అన్నారు. విద్యార్థులు పరిశుభ్రత పట్ల బాధ్యతతో వ్యవహరించి, సమాజంలో మార్పుకు దారితీయాలని ఆకాంక్షించారు. కార్యక్రమం చివర్లో అందరూ పరిశుభ్రతకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

## హైదరాబాద్‌లో ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసిన సిరిసిల్ల సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఏటీ యాదవ్




సిరిసిల్ల జిల్లా . మార్చ్ 31 . (జన సంఘర్షణ )
పలు కార్యక్రమాలకి హైదరాబాద్‌కి వెళ్లిన సర్పంచ్ల ఫోరమ్ జిల్లా అధ్యక్షులు ఏటీ యాదవ్, తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌లోని ప్రముఖులు చిన్న శ్రీశైలం, డి.ఐ.జి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి గౌరవం తెలియజేశారు. ఈ సమావేశంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సర్పంచుల సమస్యలు, ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు వంటి అంశాలపై చర్చించినట్లు వారు తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరింత దృష్టి పెట్టాలని, స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారుల సహకారం అవసరమని ఏటీ యాదవ్ వివరించారు. అలాగే గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. దీనికి స్పందించిన ప్రముఖులు గ్రామీణ అభివృద్ధికి ఏటీ యాదవ్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఎలక్టోరల్ మ్యాపింగ్ సమీక్షించేందుకు బిఎల్ఓ లతో సమీక్ష సమావేశం




బోధన్ : మార్చి 31 జన సంఘర్షణ
బోధన్ సబ్-కలెక్టర్ బోధన్ తహసీల్దార్ తో కలిసి, ఎలక్టోరల్ మ్యాపింగ్ స్థితి సిద్ధతను సమీక్షించేందుకు బిఎల్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చర్చలు ముఖ్యంగా జనాభా పరంగా సమానమైన ఎంట్రీలు (డి, యస్ ఈ) పెండెన్సీని త్వరితగతిన క్లియర్ చేయడం, ఫారమ్‌లు 6, 6ఏ, 7, 8 (45/30/15 రోజులు, 7 రోజుల లోపు పెండింగ్‌లో ఉన్నవి) ను నిర్దేశిత గడువుల్లో పరిష్కరించడంపై కేంద్రీకృతమయ్యాయి. అన్ని పెండింగ్ సింగిల్ బిఎల్ఓ అభ్యర్థనలను కూడా సమీక్షించి, "బుక్ ఎ కాల్" అభ్యర్థనలను వెంటనే స్వీకరించి, సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించాల్సిందిగా సూచనలు జారీ చేశారు.

## బాన్సువాడ బస్ స్టాండ్‌లో బాన్సువాడ డిపో మేనేజర్ రవి కుమార్ ఆధ్వర్యంలో మహాలక్ష్మి పథకం..




మార్చ్ 31 (జనసంఘర్షణ)
విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు 290 కోట్ల ఉచిత ప్రయాణాలు, 10,000కోట్లు ఆదా చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి. ఈ సందర్భంగా పోచారం గారు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా 2023 డిసెంబర్ 09 తేదీన ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలో ఉచితంగా ప్రయాణించిన మహిళా ప్రయాణికులు సుమారుగా 290 కోట్లు కాగా ప్రయాణికులు ఆదా చేసుకున్న మొత్తం 10,000 కోట్ల రూపాయలు. అందులో బాన్సువాడ డిపో నుండి మహాలక్ష్మి పథకం ప్రారంభమయిన నుండి 30 మార్చి 2026 వరకు ఉచితంగా ప్రయాణించిన మహిళా ప్రయాణికులు 2.42 కోట్లు కాగా ప్రయాణికులు ఆదా చేసుకున్న మొత్తం రూపాయలు 90.32 కోట్లు. రూ 10000 కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా రాష్ట్ర మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను ఘనంగా సన్మానించిన పోచారం. పాల్గొన్న బాన్సువాడ పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, మహిళలు.

## లక్ష్మాపూర్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ సమగ్ర సర్వే..



ఎల్లారెడ్డి.మార్చ్ 31 (జసంఘర్షణ)
లక్ష్మాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి సమగ్ర సర్వే నిర్వహించారు. గ్రామ ప్రజలతో నేరుగా మమేకమై వారి జీవన పరిస్థితులు, అవసరాలను తెలుసుకుంటూనే విద్య యొక్క ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించారు. ముఖ్యంగా పిల్లల విద్య, బాలికల చదువు అవసరం, విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాల్సిన ప్రాముఖ్యతను స్పష్టంగా వివరించారు. ప్రతి చిన్నారి విద్యావంతుడిగా మారితేనే సమాజం అభివృద్ధి సాధ్యమని వాలంటీర్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాల ఎల్లారెడ్డి నుండి ఎకనామిక్స్ అధ్యాపకులు కృష్ణప్రసాద్, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు మోహిన్ , లక్ష్మాపూర్‌కు విచ్చేసి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ప్రేరణాత్మక ఉపన్యాసం అందించారు. భవిష్యత్తులో లక్ష్యసాధన, వ్యక్తిత్వ వికాసం, సమాజ సేవలో యువత పాత్ర వంటి అంశాలపై విలువైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాణి, ఎకనామిక్స్ అధ్యాపకులు కృష్ణప్రసాద్, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు మోహిన్, వాలంటీర్లు పాల్గొన్నారు.


## సురక్షిత ప్రయాణం - సుఖమయ జీవనం

◆ కిష్టాపూర్ గ్రామంలో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు




బీర్కూరు :మార్చ్31 (జనసంఘర్షణ)
కామారెడ్డి జిల్లా, బీర్కూర్: బీర్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో "అరైవ్ అలైవ్ – 2026" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీర్కూర్ ఎస్ఐ మహేందర్, గ్రామస్థులు, వాహనదారులకు రోడ్డు నిబంధనలపై కీలక సూచనలు చేశారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణ రక్షణ కవచం లాంటిదని ఆయన పేర్కొన్నారు. అలాగే వాహనాలు నడిపేటప్పుడు ఎల్లప్పుడూ రోడ్డుకు ఎడమ వైపు నుంచే వెళ్లాలని, అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గారు మాట్లాడుతూ.."మనం ఇంటి నుండి బయటకు వెళ్లినప్పుడు మన కుటుంబ సభ్యులు మన కోసం ఎదురుచూస్తుంటారని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి" అని భావోద్వేగంగా పిలుపునిచ్చారు. అజాగ్రత్త వల్ల జరిగే చిన్న పొరపాటు కుటుంబాలను తీరని శోకంలో ముంచుతుందని, కావున యువత, గ్రామస్థులు బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. "సురక్షితంగా ప్రయాణించండి – సురక్షితంగా గమ్యానికి చేరుకోండి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ పోలీస్ సిబ్బంది, కిష్టాపూర్ గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## పుట్టు పంచల మహోత్సవంలో పాల్గొన్న డిసిసి ఏలే..



మార్చ్ 31 (జనసంఘర్షణ)
నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబర్ సాయిలు పుట్టుపంచల మహోత్సవంలో పాల్గొన్న కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్.

## ఇల్లందు భవిష్యత్తుపై పాలకుల నిర్లక్ష్యం, నిప్పులు చెరిగిన బీజేపీ నేత దోమల మహేశ్వర్ !




ఇల్లందు మార్చ్ 31 (జన సంఘర్షణ)
శతాబ్దాల కాలంగా దేశానికి వెలుగులు పంచిన ఇల్లందు గడ్డ నేడు పాలకుల నిర్లక్ష్యంతో చీకట్లోకి వెళ్తోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దోమల మహేశ్వర్ ధ్వజమెత్తారు. ఇల్లందు ఉనికి కోల్పోతున్నా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు పట్టించుకోకపోవడం శోచనీయమని ఆయన మండిపడ్డారు.

కనుమరుగవుతున్న ఉపాధి: బొగ్గుకు పుట్టినిల్లయిన ఇల్లందులో కొత్త మైన్స్ ఏర్పాటు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని, దీనివల్ల స్థానికులు ఉపాధి, వ్యాపార అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పూసపల్లి ఓసీ: ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పూసపల్లి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ పనులు అడుగు ముందుకు పడకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త గనుల కోసం పాలక పక్షం, యూనియన్లు ఎందుకు ప్రయత్నించడం లేదని ప్రశ్నించారు.

రాజకీయాలు పక్కన పెట్టండి: ఎన్నికల వరకే రాజకీయం ఉండాలని, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి కోసం ప్రజాసంఘాలు, రాజకీయ పక్షాలు ఏకమై నాయకులపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు.

ప్రజా ఆగ్రహం తప్పదు:
ఇల్లందు భవిష్యత్తు కోసం బీజేపీ తరపున తాము నిరంతరం పోరాడుతున్నామని, ఇప్పటికైనా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు మేల్కోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని దోమల మహేశ్వర్ హెచ్చరించారు.

## బయ్యారం మండలంలో మద్యం దందా బహిర్గతం

- ఎమ్మార్పీకి మించి వసూళ్లు, అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం





భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి :(జన సంఘర్షణ )
బయ్యారం, మార్చి 31: బయ్యారం మండలంలో మద్యం వ్యాపారులు అడ్డూ అదుపులేకుండా దోపిడీకి పాల్పడుతున్నారని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూక్య రవి నాయక్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎమ్మార్పీ ధరకు మించి ఒక్కో క్వార్టర్, బీరు సీసాపై రూ.30 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో సేవాలాల్ సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బయ్యారం, గార్ల మండలాల్లో మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి ప్రజలను విచ్చలవిడిగా దోచుకుంటున్నారని ఆరోపించారు. గ్రామాల్లో క్వార్టర్ బాటిల్‌పై ఎమ్మార్పీ ధరకు అదనంగా రూ.50 వరకు వసూలు చేస్తున్నా, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మండలంలో సుమారు 250 బెల్ట్ షాపులు అక్రమంగా నడుస్తున్నాయని, తెల్లవారుజామున ఆటోల ద్వారా మద్యం సరఫరా జరుగుతున్నదని చెప్పారు. లైసెన్స్ ఉన్న షాపులలోనే ఎమ్మార్పీ కంటే రూ.25 ఎక్కువగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రశ్నిస్తే "నెల నెల మామూలు ఇవ్వాల్సిందే... మీరు పట్టించిన సరుకే మాకు తిరిగి వస్తుంది" అంటూ వ్యాపారులు సమాధానం ఇస్తున్నారని తెలిపారు. బెల్ట్ షాపుల నివారణలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, అక్రమ వసూళ్లు అరికట్టకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. తక్షణమే ఎక్సైజ్ శాఖ స్పందించి ఎమ్మార్పీ ధరకే మద్యం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుగులోతు నరేష్ నాయక్, భూక్య లక్ష్మా నాయక్, రూప్లా నాయక్, శ్రవణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ చేసిన సిబ్బందికి వీడ్కోళ్ళు




నిజామాబాద్ : మార్చి 31జన సంఘర్షణ
నిజామాబాద్ పోలీస్ శాఖలో మార్చ్ 31న " పదవి విరమణ " నేపధ్యంలోని మార్చ్ నెలలో పదవి విరమణ చేసిన సిబ్బంది వివరములు. పి. శ్రీనివాస్, ఎస్టాబ్లిష్మెంట్ సూపర్డెంట్ (ఎ), సి.పి.ఓ ఆఫీస్ నిజామాబాద్ మొత్తం సర్వీస్ 39 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి పదవీ విరమణ పొందినారు. పీ.రవీందర్, సి.సి.ఎస్, ఇన్స్పెక్టర్ నిజామాబాద్ మొత్తం సర్వీసు పోలీస్ శాఖలో (43) సంవత్సరాలు పూర్తి చేసి నేడు పదవి విరమణ పొందినారు. టి. శ్యాం కుమార్ ఎస్సై వి.ఆర్- నిజామాబాద్ అటాచ్మెంట్ కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ పోలీస్ శాఖలో ( 43 ) సం॥ ల సర్వీసు పూర్తి చేసి " పదవి విరమణ" పొందినారు. ఆర్.గంగారం, ఎ.ఎస్.ఐ నిజామాబాద్ టౌన్ నాలుగు వ పోలీస్ శాఖలు (37) సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసి నేడు పదవీ విరమణ పొందినారు. డి.ప్రభాకర్ ,హెడ్ కానిస్టేబుల్ -1494 మహిళా పోలీస్ స్టేషన్ నిజామాబాద్ పోలీస్ శాఖలో (35) సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసి నేడు పదవీ విరమణ పొందినారు. మంగళవారం రోజున మధ్యాహ్నం పదవి విరమణ" వీడ్కోలు కార్యాక్రమం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వ సూచించారు. వీరికి శాలువలతో సత్కరించి" పదవి విరమణ శుభాకాంక్షలు సర్టిఫికేటు ( జ్ఞాపికలతో ) " ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.యస్, మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఎంతో పనివత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా పదవి విరమణ చేయడం ఎంతో గోప్పవిషయమని ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పక ఉంటుందని, మీరు పోలీస్ డిపార్టుమెంటు కు చేసిన సేవలు ఎంతో ఘనీయమని పదవి విరమణ అనంతరము మీకు ఎలాంటి అవసరం వచ్చిన మీకు ఎల్లవేళలసహాయపడుతామని , మీరు మరియు మీ కుటుంబ సభ్యులు అయురారోగ్యాలతో ఉండాలని, మీ పిల్లల భవిష్యత్తుభాగుండాలని ఆకాంక్షించారు. ఈ వీడ్కోళ్లు సందర్భంగా అదనపు డీ.సీ.పీ (అడ్మిన్) బస్వా రెడ్డి , ఎ.ఓ, ఆసియా బేగం, ఆఫీస్ సూపర్డెంట్లు శంకర్, బషీర్ అహ్మద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, శ్రీధర్ రెడ్డి, రిజర్వు ఇన్స్పెక్టర్ (అడ్మిన్) ధరణి కుమార్, (ఎం.టీ.ఓ) ఎస్. శేఖర్ బాబు, సతీష్ మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టం శ్రీలత, టౌన్-4 పి ఎస్, ఎస్.హెచ్.ఓ సతీష్ కుమార్, పదవి విరమణ వారి కుటుంబ సభ్యులు హాజరుకావడం జరిగింది.

## వైద్యరంగంలో భద్రాద్రి సరికొత్త రికార్డు: ఏజెన్సీ గర్భిణులకు అండగా 'టిఫా' స్కాన్ సేవలు!



భద్రాద్రి కొత్తగూడెం మార్చ్ 31 (జన సంఘర్షణ)
జిల్లా వైద్యారోగ్య రంగం మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లోని సామాన్యులకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను చేరువ చేస్తూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరికొత్త రికార్డు సృష్టించింది. ముఖ్యంగా గర్భిణుల పాలిట వరప్రదాయినిగా మారే 'టిఫా' స్కాన్ సేవలు ఇప్పుడు జిల్లాలోని ఆరు ప్రధాన ఆసుపత్రుల్లో అందుబాటులోకి వచ్చాయి.

కలెక్టర్ చొరవ.. తీరిన రేడియాలజిస్టుల కొరత : గతంలో అత్యాధునిక యంత్రాలు ఉన్నప్పటికీ, రేడియాలజిస్టుల కొరత కారణంగా ఈ సేవలు నిలిచిపోయాయి. అయితే, జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేక చొరవతో యుద్ధప్రతిపాదికన రేడియాలజిస్టులను నియమించడంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఈ స్కానింగ్ సౌకర్యం కల్పించడం వల్ల పేద ప్రజలకు వేల రూపాయల ఆర్థిక భారం తప్పడమే కాకుండా, ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీయాల్సిన అవస్థలు తప్పాయి.

శిశువుల ఆరోగ్యానికి భరోసా : గర్భిణుల కడుపులోని శిశువుల పుట్టుక లోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించడంలో 'టిఫా' స్కాన్ అత్యంత కీలకం. అశ్వారావుపేట, చర్ల వంటి మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లోని గర్భిణులకు సైతం ఈ సేవలు అందుబాటులోకి రావడం విశేషం. మాతాశిశు మరణాల రేటును తగ్గించడంతో పాటు, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడనుంది.
ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం దిశగా జిల్లా యంత్రాంగం తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## సత్తుపల్లి మున్సిపల్ ఆఫీస్‌లో ఏసీబీ 'మెరుపు' దాడి: రికార్డుల వేటలో అధికారులు!



సత్తుపల్లి మార్చ్ 31 (జన సంఘర్షణ)
అవినీతి తిమింగలాల గుండెల్లో ఏసీబీ అధికారులు రైళ్లు పరిగెత్తించారు. సత్తుపల్లి పురపాలక కార్యాలయం వేదికగా మంగళవారం ఒక్కసారిగా ఏసీబీ సోదాలు నిర్వహించడం స్థానికంగా పెను కలకలం రేపింది.

అక్రమాలపై గురి: మున్సిపల్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో భారీగా అక్రమాలు జరిగినట్లు ఏసీబీ అధికారులకు పక్కా సమాచారం అందింది. ఈ ఫిర్యాదుల ఆధారంగా రంగంలోకి దిగిన ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేష్ బృందం, కార్యాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టింది.

రికార్డుల పరిశీలన: డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో అధికారులు ప్రతి రికార్డును జల్లెడ పట్టారు. ముఖ్యంగా నిధుల మళ్లింపు, పనుల నాణ్యతపై ఆరా తీశారు.

స్టేట్మెంట్ల నమోదు: కార్యాలయంలోని పలువురు అధికారుల నుండి కీలక సమాచారాన్ని సేకరించడమే కాకుండా, వారి స్టేట్మెంట్లను కూడా రికార్డ్ చేసినట్లు డీఎస్పీ రమేష్ వెల్లడించారు.

వణుకుతున్న అక్రమార్కులు: ఏసీబీ దాడులతో మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ల గుండెల్లో గుబులు మొదలైంది. తనిఖీల్లో ఎలాంటి నిజాలు బయటపడతాయో, ఎవరిపై వేటు పడుతుందోనన్న ఉత్కంఠ సత్తుపల్లిలో నెలకొంది.

# గోదావరి పుష్కర ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలి

◆ అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి దిశానిర్దేశం
◆ కందకుర్తి పుష్కరఘాట్ సందర్శన



నిజామాబాద్, మార్చి 31 : ( జన సంఘర్షణ )
వచ్చే ఏడాది జూలైలో అట్టహాసంగా జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఏర్పాట్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర ఘాట్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పక్షం రోజుల క్రితం కూడా ఈ పుష్కర ఘాట్ ను సందర్శించిన సమయంలో అధికారులకు పురమాయించిన పనులను వారు ఏమేరకు చేపట్టారు అని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. పుష్కర ఘాట్ కు వచ్చే మార్గాలలో రహదారుల మరమ్మతులు, విస్తరణ పనులను, శివాలయం వద్ద కొనసాగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని అన్నారు. పుష్కరాల సమయంలోనే కాకుండా ఈ ప్రదేశానికి సాధారణ సమయాలలోనూ భక్తులు తరలివస్తారని, వారి సౌకర్యార్ధం పరిసరాల పరిశుభ్రతతో పాటు భక్తులకు కనీస వసతులు అందుబాటులో ఉండేలా చొరవ చూపాలన్నారు. గోదావరి పుష్కరాలకు త్రివేణి సంగమ ప్రాంతం అయినందున ఈ ఘాట్ వద్ద పుణ్య స్నానాల కోసం ప్రముఖులతో పాటు, లక్షలాదిగా భక్తులు పుణ్య స్నానాలకు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాకపోకలకు ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు ఆయా మార్గాలలో అవసరమైన చోట కల్వర్టుల నిర్మాణాలు సైతం చేపట్టాలన్నారు. వి.వి.ఐ.పీల కోసం హెలిప్యాడ్ ను నిర్మించాలని, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, భక్తులు బస చేసేందుకు వీలుగా తగిన వసతి, షామియానాలు వంటి వాటిని నాణ్యతతో చేపట్టి నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఘాట్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ కందకుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెంజల్ మండల అధికారులతో సమావేశం అయ్యారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, జనాభా గణన ప్రక్రియల నిర్వహణపై కీలక సూచనలు చేశారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, దేవాదాయ శాఖ అధికారులు కమల, విజయరామారావు, తహసిల్దార్ శ్రవణ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థికి ద్వితీయ బహుమతి



ఎల్లారెడ్డి, మార్చి -31 (జన సంఘర్షణ )
ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న అరుణ్ కుమార్ బాన్సువాడలో జరిగిన మేర యువ భరత్ జిల్లా స్పోర్ట్స్ మీట్ 2025-26లో ద్వితీయ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి అరుణ్ కుమార్‌ను కళాశాల స్పోర్ట్స్ విభాగం అధికారులు శివ కుమార్, కృష్ణ ప్రసాద్ లు అధ్యాపక అధ్యాపకేతర బృందం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్‌ను తనను ప్రోత్సహించిన స్పోర్ట్స్ విభాగం అధ్యాపకులు శివ కుమార్ , కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్ అభినందించారు.

జన సంఘర్షణ
బుధవారం 01 ఏప్రిల్ 2026

# పోలీసుల తీరును నిరసిస్తూ ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ల ధర్నా..

◆ అన్ని పత్రాలు ఉన్నప్పటికీ భారీగా జరిమానా వేస్తున్న పోలీసులు





బీర్కూర్ /మార్చ్31/(జన సంఘర్షణ)

పోలీస్ శాఖకు ఉన్నత అధికారులు ఏది ఏమైనా చేయండి, మీకు ఇచ్చిన టార్గెట్ ను పూర్తి చేయండి అంటూ ఆదేశాలు రావడంతో, ఇదే ఆసరాగా తీసుకొని కొన్ని పోలీస్ స్టేషన్ల బాసులు, పోలీసులు ఉదయం లేవగానే రోడ్లపై పడి వాహనాలపై వెళ్లే వారిని తనిఖీలు చేస్తూ, పత్రాలు లేవు, పెండింగ్లో చాలన్లు ఉన్నయంటూ ఫోటోలు దిస్తూ వాన దారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రహదారులపై ఏదైనా శుభ కార్యక్రమం గాని, అశుభం కార్యక్రమాలు గాని వెళ్లాలంటే ఈ పోలీసులతో నాన ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ఏమని అంటే మాకు పై అధికారులు ఇంత టార్గెట్ ఇచ్చారు, ఆ టార్గెట్ పూర్తి చేయాలంటూ, రోడ్లపై నిలబడి వసూళ్ల బేరం మొదలుపెట్టారు. ముఖ్యంగా బాన్సువాడ డివిజన్ సర్కిల్ పరిధిలోని బీర్కూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ, పోలీసుల తీరు ప్రజలను ఇబ్బందులకు కలిగిస్తున్నాయి. ప్రతిరోజు బైరాపూర్, బీర్కూర్, బీర్కూర్ పోలీస్ స్టేషన్ వద్ద, వైన్స్ సమీపంలో, కిష్టాపూర్ శివారులో పోలీసులు అడ్డాలు వేసి ఆ దారి గుండా వెళ్లే ద్విచక్ర వాహనదారులకు, ఇసుక ట్రాక్టర్లకు, కార్లకు ఆపి ఫోటోలు కొట్టి పెద్ద ఎత్తున చాలన్లు పెండింగ్లో ఉన్నాయంటూ వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. వైన్స్ పక్కనే పోలీసులు ఉండి, పర్మిట్ రూము నుంచి మద్యంతాగి బయటకు వచ్చిన వ్యక్తులకు పట్టుకొని మద్యం తాగినవని ,వారిని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నారు. పోలీసులకు కావలసింది వారికి ఉన్నతాధికారులు ఇచ్చిన టార్గెట్ ను పూర్తి చేసుకోవడానికి ఇష్టం వచ్చినట్లుగా రోడ్లపై నిలబడి పెద్ద ఎత్తున డబ్బుల బేరం మొదలుపెట్టారు. బీర్కూర్ కు మంజీరా నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన తర్వాత, బీర్కూర్ మార్కెట్ పుంజుకుంది. మద్నూర్, బిచ్కుంద, డోంగ్లి మండలాలకు చెందిన ప్రజలు వ్యాపారం కోసం ఇక్కడికి వచ్చి పోతుంటారు, పోలీసులు పోలీస్ స్టేషన్ వద్ద వాహనాల తనిఖీల పేరిట పోలీసుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అక్కడి ప్రాంత ప్రజలు బీర్కూర్ కు వ్యాపార రీత్యా రావడానికి జంకుతున్నారు . కేవలం పోలీసుల తనిఖీల భయంతో అక్కడి ప్రాంత ప్రజలు బీర్కూర్ కు రావడానికి వెనుకంజ వేస్తున్నారు. బీర్కూర్ కు వచ్చే వ్యాపారస్తులు, కొనుగోలుదారులు బిచ్కుంద, మద్నూర్ వైపు వెళ్లడంతో బీర్కూర్లో వ్యాపారాలు కుంటుపడుతున్నాయి. పోలీస్ స్టేషన్ ముందు పోలీసులు ఉదయం, మధ్యాహ్నం సాయంత్రం. అడ్డవేసి బీర్కూర్బిడోంగ్లి రహదారి వెళ్లే మార్గాన వాహనాల తనిఖీ పేరిట ఇబ్బందులు గురి చేస్తున్నారు. అంతేకాకుండా మంజీరా నది పర్యాయక ప్రాంతంలో బీర్కూర్ ప్రాంత రైతుల పంట భూములు ఉన్నాయి ఆ పంట భూములకు వెళ్లే రైతులను హెల్మెట్ ఏది,? బండి కాగితాలు చూపెట్టండి అంటూ బెదిరిస్తూ రైతులను ఇబ్బందులు పాలు చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం కిష్టాపూర్, చించొల్లి గ్రామాల నుంచి ఇసుక ట్రాక్టర్లలో తరలించుకొని పోతుంటే, వేబిల్లులు, అన్ని దృవీకరణ పత్రాలు ఉన్నప్పటికీ ట్రాక్టర్ డ్రైవర్లను బెదిరింపులకు పాల్పడుతూ ట్రాక్టర్లను ఫోటోలను తీసి ఒక్కొక్క ట్రాక్టర్ వెయ్యి రూపాయల నుంచి 500 రూపాయల వరకు జరిమానా వేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పోలీసుల పనితీరున నిరసిస్తూ మంగళవారం కిష్టాపూర్, చించోలి గ్రామాలకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు బాన్సువాడ బీర్కూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమకు పోలీసులు వారి టార్గెట్ పూర్తి చేసుకోవడానికి వేధిస్తున్నారని ట్రాక్టర్ల డ్రైవర్లు, ట్రాక్టర్ల యజమానులు పోలీసుల పనితీరుపై తప్పుపడుతున్నారు. ప్రతిరోజు పోలీసులతో ఇదే ఇబ్బంది ఎదుర్కొంటున్నామని ట్రాక్టర్ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వ పథకాలకు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం అధికారుల అనుమతితో ఇసుక తీసుకెళ్తుంటే పోలీసులు తనిఖీల పేరిట తమకు ఇబ్బందులకు గురిచేస్తూ భారీ ఎత్తున జరిమానా వేస్తున్నారని డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. రాత్రి 10:00 నుంచి తెల్లవారుజాముల వరకు కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకుల ట్రాక్టర్లు, బొలెరో వాహనాల్లో పోలీస్ స్టేషన్ ముందునుంచి తీసుకువచ్చి డప్పు చేసి, హైదరాబాద్, నిజామాబాద్, దెగ్లూరు, బోధన్ ప్రాంతాలకు తరలించి లక్షలు గడిస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారు. బీర్కూర్ పోలీసుల పనితీరుపై జిల్లా ఎస్పీ రవిచంద్ర, డిఐజి శివధర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు.

# మహాలక్ష్మి విజయోత్సవ సభ

◆ 290 కోట్ల ఉచిత ప్రయాణాలు.. 10000 కోట్లు ఆదా చేసిన సందర్భంగా సంబరాలు
◆ మహిళలకు రాష్ట్రం పెద్దపీట వేస్తుంది
◆ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వెల్లడి




బాన్సువాడ / మార్చ్ 31/(జన సంఘర్షణ)

బాన్సువాడ బస్టాండ్ లో బాన్సువాడ డిపో మేనేజర్ రవి కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు 290 కోట్ల ఉచిత ప్రయాణాలు,10,000 కోట్లు ఆదా చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి. ఈసందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా 2023 డిసెంబర్ 09 తేదీన ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలో ఉచితంగా ప్రయాణించిన మహిళా ప్రయాణికులు సుమారుగా 290 కోట్లు కాగా ప్రయాణికులు ఆదా చేసుకున్న మొత్తం 10,000 కోట్ల రూపాయలు అందులో బాన్సువాడ డిపో నుండి మహాలక్ష్మి పథకం ప్రారంభమయిన నుండి 30 మార్చి 2026 వరకు ఉచితంగా ప్రయాణించిన మహిళా ప్రయాణికులు 2.42 కోట్లు కాగా ప్రయాణికులు ఆదా చేసుకున్న మొత్తం రూపాయలు 90.32 కోట్లు రూ10000 కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా రాష్ట్ర మహిళలకు శు భాకాంక్షలు తెలిపారు, ఈసందర్భంగా పలువురు మహిళలను ఘనంగా సన్మానించిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ఈకార్యక్రమంలో డిపో మేనేజర్ రవికుమార్, కామారెడ్డి జిల్లా మైనారిటీ అధ్యక్షులు మున్సిపల్ కౌన్సిలర్ అబ్దుల్ ఖాలేఖ్, నాయకులు జంగం గంగాధర్, కృష్ణారెడ్డి, నార్ల రవీందర్, కాసుల రోహిత్, యండి. దావూద్, కౌన్సిలర్లు జంగం రాజశేఖర్, రమేష్, వెంకటేష్, నగేష్, మజ్జు, తదితరులు పాల్గొన్నారు

## ఆహ్వాన పత్రిక అందజేసిన జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మం జిల్లా సింగరేణి ప్రతినిధి (జన సంఘర్షణ )



తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్యవిక్రమాదిత్య వివాహ అనంతర విందు వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పూవాళ్ళ దుర్గాప్రసాద్ మర్యాదపూర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా కోటమైసమ్మ ఆలయ ధర్మకర్త పర్సా పట్టాభిరామారావును కలిసి, జరిగే విందు కార్యక్రమానికి విచ్చేసి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ ఆహ్వాన కార్యక్రమం సాదాసీదాగా జరిగినప్పటికీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, కార్యదర్శి బానోత్ రామ్మూర్తి నాయక్, మండల సర్పంచులు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి కుటుంబంలో జరుగుతున్న ఈ శుభకార్యానికి హాజరై ఆశీర్వదించడం తమకు ఆనందంగా ఉందని తెలిపారు. అలాగే రానున్న విందు వేడుక ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని, పెద్ద సంఖ్యలో నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ ఆహ్వాన పత్రిక అందజేత కార్యక్రమం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## లంచం తీసుకుంటూ ఏసీబీ కి చిక్కిన గుడిబండ తహాశీల్దార్ శ్రీధర్

తెలంగాణ/మార్చ్ 31/(జన సంఘర్షణ)



సత్య సాయి జిల్లాలో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన తాసిల్దార్ శ్రీధర్.షేక్ సద్దాం అనే రైతు నుంచి కార్యాలయంలోనే 20 వేల రూపాయలు లంచం తీసుకుంటు ఏసీబీ కి చిక్కిన తహశీల్దార్. రాయపురం గ్రామానికి చెందిన 4 ఎకరాల భూమికి సంబంధించి పాసు పుస్తకాలు మంజూరు చేయడం కోసం లంచం డిమాండ్ చేసిన తహశీల్దార్ శ్రీధర్. 20 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు. ఏసీబీ డిఎస్పీ ప్రసాద్ రెడ్డి, సిఐ హమీద్ ఖాన్ ఆధ్వర్యంలో విచారణ.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

భైంసా, మార్చి 31 (జనసంఘర్షణ)



భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముధోల్ తాలూకా మాజీ శాసన సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ భోస్లే నారాయణ రావు పటేల్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ముధోల్ తాలూకాలోని 7 మండలాలకు చెందిన మొత్తం 60 మంది లబ్ధిదారులకు సుమారు రూ.20 లక్షల విలువైన చెక్కులు అందజేయడం జరిగింది. సకాలంలో ఆర్థిక సహాయం అందించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, నిర్మల్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, అలాగే మాజీ ఎమ్మెల్యే శ్రీ భోస్లే నారాయణ రావు పటేల్లకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కమిటీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, మాజీ ఎంఎపీపీ చంద్, ఆత్మ చైర్మన్ ఎస్. వివేకానంద, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పురశెట్టి రవికుమార్, యూత్ కాంగ్రెస్ దేవి దాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ


తానూర్, మార్చి 31: (జన సంఘర్షణ)



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బుధవారం నుంచి తానూర్ మండలంలో ఒకేసారి మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం పంపిణీ చేపడుతున్నట్లు మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు శంకర్ రావు కులకర్ణి తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ (బుధవారం) నుంచి మండలంలోని అన్ని గ్రామాల రేషన్ షాపుల్లో ఈ పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన బియ్యాన్ని లబ్ధిదారులకు ఒకేసారి అందజేస్తామని తెలిపారు. అధికారులు ఆదేశానుసారం ఈ కార్యక్రమం కోసం అవసరమైన బియ్యం ఇప్పటికే రేషన్ దుకాణాల్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. లబ్ధిదారులు తమ రేషన్ కార్డులతో సమయానికి వచ్చి బియ్యాన్ని తీసుకోవాలని సూచించారు. పంపిణీ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

## ఏప్రిల్ 2న బీబీపేటలో హనుమాన్ జయంతి వేడుకలు

బీబీపేట్,మార్చ్ 31 ( జన సంఘర్షణ )



స్వస్తిశ్రీ పరాభవ నామ సం॥ర చైత్ర మాస శు॥ పూర్ణిమ తేది: 02-04-2026 గురువారం రోజున మన బీబీపేట గ్రామములోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గల శ్రీ బాలాంజనేయస్వామి వారి మందిరములో హనుమాన్ జయంతి ఉత్సవములు జరిపించుటకు నిశ్చయించడమైనది.

-:: కార్యక్రమాలు ::-

తేది.02-04-2026 గురువారం రోజున :

- ఆంజనేయస్వామికి పంచామృత, ఫల, అభిషేకములు, సింధూరపూజ, నాగవల్లీదళ పత్రపూజ, మన్యుసూక్త హోమము, పూర్ణాహుతి జరుపబడును.
- మధ్యాహ్నము 1 గం॥లకు అన్నదాన కార్యక్రమము జరుపబడును.
- సా॥ 6 గం॥లకు స్వామివారి ఉత్సవ విగ్రహము ఊరేగింపు సేవ జరుపబడును.

కావున బీబీపేట గ్రామ ప్రజలు మరియు పరిసర గ్రామ ప్రజలు ఇట్టి భగవత్ కార్యక్రమములో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరుతున్నాము.

అన్నప్రసాద వితరణ దాత:
శ్రీమతి & శ్రీ మాసానిపల్లి చంద్రకళ-పెరమాండ్లు గారు
బీబీపేట

ఆహ్వానించువారు :
శ్రీ హనుమాన్ మాలాధారణ భక్తమండలి
గ్రా॥ & మం॥ బీబీపేట, జి॥ కామారెడ్డి.

కామారెడ్డి జిల్లా ,బీబీపేటలో ఏప్రిల్ 2న శ్రీ బాలాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం పంచామృతాభిషేకం, సింధూరపూజ, హోమం వంటి పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. మధ్యాహ్నం 1 గంటకు అన్నదానం, సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు నిర్వహించనున్నారు. గ్రామ ప్రజలు, పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.

## ఇల్లందు మండలంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య పర్యటన

భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి :(జన సంఘర్షణ )




ఇల్లందు, ఏప్రిల్ 1: ఇల్లందు మండలంలో శాసన సభ్యులు కోరం కనకయ్య బుధవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించనున్నారు. పర్యటనలో భాగంగా ఉదయం 10 గంటలకు రెపల్లేవాడ గ్రామ పంచాయితీకి చేరుకొని అక్కడ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. అనంతరం ఉదయం 11 గంటలకు కొమరారం గ్రామ పంచాయితీలో, మధ్యాహ్నం 12 గంటలకు ఇల్లందు వ్యవసాయ మార్కెట్ యార్డ్లో నిర్వహించనున్న కార్యక్రమాల్లో పాల్గొని కేంద్రాలను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మండలానికి చెందిన నూతన, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను కూడా ప్రత్యేకంగా ఆహ్వానించారు.

# పౌర హక్కుల అవగాహన దినోత్సవం



**పోతంగల్/ మార్చి 31/(జన సంఘర్షణ)**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పొతంగల్ సర్పంచ్ కల్లూరి సంధ్య హనుమాన్లు ఆధ్వర్యంలో మంగళవారం రోజున పౌర హక్కుల అవగాహన దినోత్సవం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ హాస్టల్ వార్డెన్ నరహరి మాట్లాడుతూ పిల్లలను తప్పకుండా చదివించాలి. ఇతరులకు చెడు వ్యక్తిగా కాకుండా మంచి విద్యను అందించాలి. పిల్లలకు 5 తరగతి నుండి 10 తరగతి వరకు స్కాలర్షిప్ ఎస్సీ అబ్బాయి గాని అమ్మాయి గాని బిసి అమ్మాయి గాని అబ్బాయికి గాని వివాహం చేసుకుంటే ప్రభుత్వం 2.12 లక్షల రూపాయలు ఇస్తుంది. ఈ కార్యక్రమం ప్రతినెల మండల కేంద్రంలోని ఒక గ్రామంలో పెట్టడం జరుగుతుంది కులాలకు మతాలకు అతీతంగా అంటరానితనం ముట్టుడు అంటుడు అనేదానికి ప్రభుత్వం కొన్ని చట్టాలను తీసుకువచ్చింది. ఆ చట్టాలలో మనం కూడా భాగస్వామ్యం కావాలి నిర్వీర్యం కావాలి జనజీవనంలో కలవాలి. మనిషి మనిషిగా బ్రతకాలి. ఆ రూపకల్పన భాగంగానే పౌరహక్కుల అవగాహన దినోత్సవం జరుపుకుంటున్నారు. ఎస్సీ ఎస్టీ పైన చాలా రకమైన దాడులు ముట్టుడు అంటుండు అన్నవారికి బాబా సాహెబ్ అంబేద్కర్ చేసిన కృషి పట్ల అటువంటి విషయాలు ఏవైనా ఉంటే మా దృష్టికి తీసుకురాండి. అటువంటి వారిపై చట్టపురమైన చర్యలు తీసుకుంటాము చదువుతో ఉద్యోగం వస్తుందని కాదు గాని మనం సమాజంలో ఏ విధంగా ఉండాలి అని అనుభవం వస్తుంది. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నరహరి ఆర్ ఐ గౌస్, తాసిల్దార్ అబ్దుల్ అజీజ్ ,భూమయ్య, సాయిలు, సాయిరాం ,పోశెట్టి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# సుమారు 20 లక్షల వరకు నష్టం వాటిలింది నాకు న్యాయం చేయండి

**- కౌలు రైతులైన నాకు న్యాయం ప్రభుత్వమే చేయాలి**



**రుద్రూర్/మార్చ్ 31/(జన సంఘర్షణ)**

నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం రానంపల్లి గ్రామం చెందిన ఓ రైతు తనకు 30 ఎకరాల పొలం కౌలుకు చేయటం జరిగిందని అయితే ఈ పొలం అకాల వర్షం వల్ల పూర్తిగా నష్టపోవడం జరిగిందని 20% మాత్రమే దిగుబడి వచ్చిందని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో సుమారు తాను 2200 నుంచి 2300 రూపాయలు రావాల్సింది కేవలం 1800 రూపాయల నుంచి 19 వందల రూపాయలకే తక్కువ ధరకే బ్రోకర్లు కొనుగోలు చేస్తున్నారని ప్రస్తుతం తనకు 20 లక్షల వరకు నష్టం వాటిలిందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు తన గోడును విన్నవించాడు. అదేవిధంగా రాయికూర్ గ్రామం తో పాటు ఎత్తుండా సరిహద్దు ప్రాంతంలోని ఇతర గ్రామాల్లో అదేవిధంగా బోధన్ గ్రామాలు రైతులు కూడా తమకు పూర్తిగా నష్టం వాటిలిందని బ్రోకర్లకు 1800 రూపాయల నుంచి 1900 రూపాయలకే ధాన్యం విక్రయాలు చేస్తున్నమని తమని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విన్నవించారు.

# డిగ్రీ కళాశాలలో పోటీ పరీక్షలపై అవగాహన


**ఎల్లారెడ్డి, మార్చి -31(జన సంఘర్షణ )**

ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం పైనీర్ సంస్థల డైరెక్టర్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డా. లక్ష్మీనారాయణ అన్నారు. ఈ సదస్సులో పైనీర్ సంస్థల డైరెక్టర్ సందీప్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీ పరీక్షల ప్రాముఖ్యత, సక్రమమైన సిద్ధత విధానాలు, సమయ నిర్వహణ, విజయానికి అవసరమైన వ్యూహాల గురించి విద్యార్థులకు విపులంగా వివరించారు. ఆయన సూచనలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయి. ఈ సందర్భంగా డా. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు తమ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకొని క్రమశిక్షణతో కృషి చేస్తే పోటీ పరీక్షల్లో విజయాన్ని సాధించగలరని అన్నారు. అలాగే నిత్యాభ్యాసం ప్రణాళికాబద్ధమైన చదువు ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# హనుమాన్ విగ్రహాలు ఊరేగింపు శోభయాత్ర ర్యాలీ


**పోతంగల్ /మార్చ్ 31/(జన సంఘర్షణ)**





పోతంగల్ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం సుమారు 200 సంవత్సరాల ప్రాచీన చరిత్ర కలిగిన పవిత్రక్షేత్రం. ఈ ఆలయ మహిమాన్విత చరిత్ర బాల్కీ మఠంలోని ఆధారాల ద్వారా మనకు తెలిసినది. ఈ పుణ్యక్షేత్రం 2026 సంవత్సరంలో సంపూర్ణ రాతి శిలలతో, ఆగమ శాస్త్రోక్త విధానంలో పునర్నిర్మించబడుతూ, ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం జరగబోవడం మన గ్రామానికి ఒక చారిత్రాత్మక, పుణ్యప్రదమైన ఘట్టంగా నిలుస్తోంది. ఈ మహత్తర కార్యక్రమం మన ఊరిలోని నిస్వార్థ భజన మండలి సభ్యులు మరియు నిష్కామ కర్మయోగుల అహర్నిశ కృషి వల్ల సాధ్యమైంది. వారు ఎటువంటి స్వార్థం లేకుండా చేసిన సేవలు అపారమైనవి - వారిని ఎంత సత్కరించినా తక్కువే. పూర్వం కాశీ నుండి వచ్చిన గురువులచే నిర్మించబడిన ఈ ఆలయం గొప్ప సంప్రదాయాన్ని కలిగి ఉంది. అదే ఆచార సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ప్రస్తుత ఆలయం కూడా ఆగమ శాస్త్రాలకు అనుగుణంగా నిర్మించబడుతోంది. ఈ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం పూజ్యులు, యోగసాధకులు, అనుష్ఠాన తత్వజ్ఞులు అయిన శ్రీ శివానంద శివాచార్యులవారి ఆధ్వర్యంలో, వారి కరకమలముల చేత, గ్రామ పెద్దలు, భక్తుల సమిష్టి సహకారంతో నిర్వహించబడడం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విషయం. ప్రాణ ప్రతిష్ఠ వంటి మహోన్నత దైవిక కార్యంలో భాగస్వామ్యం కావడం అనేది అనేక జన్మల పుణ్యఫలంగా లభించే అరుదైన అవకాశం. యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం మన అందరికీ గొప్ప భాగ్యం. మనము చేసే సాధారణ దానం కాలక్రమంలో కరిగిపోతుంది. కానీ దేవాలయ నిర్మాణం, యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ వంటి సేవలు శాశ్వతంగా నిలిచి, మన తరతరాలకు గర్వకారణంగా నిలుస్తాయి. అందువల్ల గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు వచ్చి, ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మనస్పూర్తిగా కోరుతున్నాము. మీకు తోచిన విధంగా - ధనం, ధాన్యం, శ్రమదానం రూపంలో సహకరించి, ఈ పుణ్యకార్యంలో భాగస్వాములు కావాలని వినమ్రంగా ఆహ్వానిస్తున్నాము. ఈ మహోత్సవంలో సేవలందించిన ప్రతి భక్తునికి శ్రీ ఆంజనేయ స్వామివారి సంపూర్ణ అనుగ్రహం లభించును. వారి కుటుంబాలు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో సుఖశాంతులతో వర్ధిల్లును. ఈ సేవ మీకే కాదు -మీ తరతరాలకు ఆదర్శంగా నిలుస్తుంది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిన్నలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# గుడిలో పూజారిని పోషించే వ్యవస్థ కనుమరుగయ్యింది !



కాదు కనుమరుగు చేశారు, ఇది ఒక పథకం ప్రకారం జరిగింది !
గుడిలో పూజారికి కడుపునిండకపోతే ఆ దేవుడు చూపిన వేరే దారి వెతుక్కుంటాడుగానీ పూజారిగా ఉండడు!
అప్పుడు గుడి ఉండదు దేవుడి పూజలూ ఉండవు!
మనం గొప్పగా చెప్పుకునే భారతీయ సంస్కృతి అసలే ఉండదు ! ... ఎందుకంటే గుడులే సంస్కారకేంద్రాలు కాబట్టి !
పూజారికి కానుకలు వేయవద్దు అని బోర్డులు ! బాగుంది !
మరి ఆయనకు జీతమెంత ఇస్తారు ఆలోచించారా ?
ఎక్కువలో ఎక్కువ 5000 / ఆడబ్బుతో పెళ్ళానికి చీరలేకొంటాడా ? పిల్లాడికి చదువులేచెప్పిస్తాడా ?
రోగం రొష్టువస్తే వైద్యమే చేయించుకుంటాడా ?
అసలు విషయం మరచిపోయా ఇంటి అద్దె కట్టి కడుపునింపుకొని గుడ్డలుకొనుక్కొన్న తరువాత కదా పైన చెప్పినవి !
గుడులు ఆదాయకేంద్రాలు కాదు అవి సంస్కారకేంద్రాలు ! అక్కడ పనిచేసేవారి జీవితం జీవనం సుఖసంతోషాలతో ఉంటేనే ! సంస్కృతి సంప్రదాయం నిలబడేది ! పూజారికి దక్షిణ ఇవ్వండి ! వారి జీవితాలలో వెలుగు నింపండి !
అప్పుడే భారతీయసంస్కారాలు పదికాలాలు నిలబడతాయి

# కామారెడ్డి రూరల్ సిఐ రామన్ బదిలీ బాధాకరం

**- సీఐ సేవలు మరువలేనివి**



**కామారెడ్డి /మార్చ్ 31/(జన సంఘర్షణ)**

కామారెడ్డి జిల్లా కామారెడ్డి రూరల్ సిఐ రామన్ బదిలీ బాధాకరమని కామారెడ్డి జిల్లా ప్రజలు అభిప్రాయపడ్డారు. సదాశివనగర్ కామారెడ్డి రూరల్ సిఐ గా విధులు నిర్వహిస్తున్న రామన్ బదిలీ అయ్యారు. ఇక్కడ దాదాపు రెండేళ్ల పాటు పనిచేసిన ఆయన బదిలీపై వెళ్లారు ఆయనను హైదరాబాద్లోని ఐజి కార్యాలయానికి ప్రభుత్వం బదిలీ చేసింది. కామారెడ్డి రూరల్ సిఐగా పనిచేయడానికి అనేకమంది తమ ప్రయత్నాలు కొనసాగించినట్టుగా ప్రచారం సాగింది గత కొద్ది కాలంగా రూరల్ సీఐ బదిలీ అవుతారని ప్రచారం నేపథ్యంలో ఇక్కడ వచ్చే అధికారులు పేర్లు చెక్కర్లు కొట్టాయి. సదాశివ నగర్ సిఐ గా రామన్ పని చేసినప్పుడు అందరికీ ఆదర్శవంతముగా పనిచేశాడు. ఫ్రెండ్లీ పోలీస్ గా బాధ్యతలు చేపట్టి అనంతరం కామారెడ్డి రూరల్ సిఐగా బాధ్యతలు చేపట్టి రెండున్నర ఏండ్లు కామారెడ్డి ప్రశాంత వాతావరణ నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించిన సీఐ రామన్ బదిలీ కావడం పట్ల కామారెడ్డి జిల్లా ప్రజలు తమ బాధ వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి రూరల్ గా పని చేసిన సిఐ రామన్ బదిలీ కావడం నమ్మబుద్ధి కావడం లేదని సిఐ రామన్ ఎక్కడున్న పదో న్యాయం పొంది డిఎస్పీగా ముందుకు రావాలని ఆశిస్తున్నామని కామారెడ్డి జిల్లా ప్రజలు పేర్కొన్నారు.

# తెలంగాణ జాగృతి నాయకులకు, కార్యకర్తలకు ఆహ్వానం

**రుద్రూర్: మార్చి.31( జన సంఘర్షణ)**



నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండలం తెలంగాణ గడ్డ మీద నూతన రాజకీయ పార్టీగా ఆవిర్భవించనున్న తెలంగాణ జాగృతికి మొదటినుండి క్షేత్ర స్థాయిలో క్రియాశీలకంగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలతో పాటు నూతన సభ్యులను కూడా అందరినీ ఆహ్వానిస్తున్నాం. ఏప్రిల్ 1, 2, 3 తేదీలలో మన కవితక్కతో హైదరాబాద్ కార్యాలయంలో జరిగే నూతన రాజకీయ పార్టీ సన్నాహక సమావేశాలకు ఆయా ఉమ్మడి జిల్లాల తెలంగాణ జాగృతి సభ్యులను ఆహ్వానిస్తున్నాం. 1 ఏప్రిల్ - 10గం.: హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ ఉమ్మడి జిల్లాలు. 2 ఏప్రిల్ - 10గం.: ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలు. 3 ఏప్రిల్ - 10గం.: నల్గొండ మహబూబ్నగర్, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాలు.

# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యపై సమగ్ర సర్వే

**ఎల్లారెడ్డి, మార్చి -31(జన సంఘర్షణ )**



లక్ష్మాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్-ఎస్ శిబిరం నాల్గవ రోజుకు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ విద్యపై సమగ్ర సర్వే నిర్వహించారు. గ్రామ ప్రజలతో నేరుగా మమేకమై వారి జీవన పరిస్థితులు, అవసరాలను తెలుసుకుంటూనే విద్య యొక్క ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించారు. ముఖ్యంగా పిల్లల విద్య, బాలికల చదువు అవసరం, అలాగే విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాల్సిన ప్రాముఖ్యతను స్పష్టంగా వివరించారు. ప్రతి చిన్నారి విద్యావంతుడిగా మారితేనే సమాజం అభివృద్ధి సాధ్యమని వాలంటీర్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇంచార్జి రాణి, అధ్యాపకులు కృష్ణప్రసాద్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

**భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందుకు ప్రతినిధి :(జన సంఘర్షణ )**



ఇల్లందు, మార్చి 31: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు అందుతున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని విస్తృతంగా వినియోగించుకుంటున్న మహిళలకు ఎమ్మెల్యే కోరం కనకయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ పథకం మహిళలకు ఉపశమనం కలిగించడమే కాకుండా, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కు కూడా ఆర్థికంగా బలాన్ని చేకూరుస్తోందని ఆయన పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన తరువాత మహిళలు పెద్ద ఎత్తున బస్సుల్లో ప్రయాణం చేయడం వల్ల సంస్థ ఖాతాలోకి దాదాపు పది వేల కోట్ల రూపాయలు చేరినట్లు ఆర్టీసీ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఆర్టీసీ యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ, మహిళల పాత్రను అభినందించింది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఇల్లందు బస్టాండ్లో ఆర్టీసీ యాజమాన్యం ఆధ్వర్యంలో మహిళలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉచిత బస్సు పథకాన్ని సద్వినియోగం చేసుకుని సంస్థ అభివృద్ధికి సహకరించినందుకు మహిళలను అభినందిస్తూ, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మునిసిపల్ చైర్పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండెల రాజు, కౌన్సిలర్లు సైదామియా, అజ్మీరా వంశీ, చిల్లా విజయభారతి, శ్రీనివాస్, రాధ, కమల్, కోరి గోపగాని రాజు గౌడ్, రేఖ స్వరూప, రవి శంకర్, గందే పద్మ, సదానందం, మెరుగు కార్తీక్, మొగిలి లక్ష్మి, ఈశ్వర్, రంప రమ్య, జాన్సన్, నీరుడు ఉపేంద్ర, సోని బాయి, కోరి ఉల్లింగ, విజయలక్ష్మి, సతీష్, మొహమ్మద్ జాఫర్, నీలాపు రమేష్, కొర్లపాటి కిరణ్ కుమార్, చెనిగరపు శృతి రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ డానియల్, సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, కోరం సురేందర్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, మహిళల సాధికారతకు మహాలక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడుతుందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పాతబస్తీలో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ

**దాడిచేసి సీజ్ చేసిన పోలీసులు**

**హైదరాబాద్, మార్చి31 :** నగరంలో కలుషిత ఆహార పదార్థాల తయారీపై పోలీసులు మరోసారి కఠిన చర్యలు తీసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటెదాన్ పారిశ్రామిక ప్రాంతంలో నాసిరకం అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి విక్రయిస్తున్న కేంద్రంపై కమిషనర్ టాస్క్‌ఫోర్స్ , హెచ్-ఫాస్ట్ బృందం సంయుక్తంగా ఆకస్మిక దాడి నిర్వహించింది. పక్కా సమాచారంతో పోలీసులు ఐడీఏలోని తయారీ సంస్థ పై దాడి చేశారు. ఈ సందర్భంగా హసన్ అలీ రూపానీ (55) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అబిడ్స్ ప్రాంతానికి చెందినవాడిగా గుర్తించారు. తనిఖీల్లో ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రంలో తీవ్ర అపరిశుభ్ర పరిస్థితులు వెలుగుచూశాయి. ప్లాస్టిక్ డబ్బాల్లో, పరిశుభ్రతకు విరుద్ధంగా పేస్ట్ తయారు
చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నాణ్యత లేని అల్లం, వెల్లుల్లి తొక్కలను ఉపయోగించి పేస్ట్ తయారు చేస్తున్నట్లు వెల్లడైంది. పేస్ట్ తయారీలో ఎసిటిక్ యాసిడ్, గమ్ పౌడర్ వంటి రసాయనాలు కలుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. తయారు చేసిన పేస్ట్‌ను బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయడంతో దుమ్ము, ఈగలు వాలినట్లు పోలీసులు తెలిపారు. ఈ పేస్ట్‌ను హోల్‌సేల్ కిరాణా దుకాణాలు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో నిందితుడు చెలగాటం ఆడుతున్నాడని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ సర్టిఫికేట్ లేకుండానే లాభాపేక్షతో ఈ అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. దాడిలో సుమారు రూ.22 లక్షల విలువైన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 4,032 కిలోల అల్లం-వెల్లుల్లి పేస్ట్, 6,000 కిలోల నాసిరకం వెల్లుల్లి, 210 కిలోల నాసిరకం అల్లం, వెల్లుల్లి పొట్టు సంచులు, 250 కిలోల ఉప్పు, ఎసిటిక్ యాసిడ్, గ్జాంతమ్ గమ్ పౌడర్, 5 గ్రైండింగ్ యంత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నిందితుడిని, స్వాధీనం చేసిన సామగ్రిని తదుపరి విచారణ కోసం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు.




## రాష్ట్రంలో ముదరుతున్న ఎండలు

## సాయంత్రాలు పలుచోట్ల వర్షాలు

**హైదరాబాద్,మార్చి31 :**
రాష్ట్రంలో ప్రస్తుతం భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. పగలంతా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉక్కపోత, వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సాయంత్రం ఆకాశం మేఘాలు కమ్ముకొని ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తున్నది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటన విడుదల చేసింది.సోమవారం ఎండలు మండిపోయి దాదాపు 30 జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలిపింది. జగిత్యాల జిల్లా ఆరుట్లలో అత్యధికంగా 41.9 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం, మంచిర్యాల జిల్లా కాసీపేట, నల్లగొండ జిల్లా పెద్దవూర, నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని పేర్కొన్నది. వచ్చే 4 రోజులు ఉష్ణోగ్రతలు ఇలానే ఉంటాయని వివరించింది.

## చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు

**నలుగురు పోలీసులకు గాయాలు**

**విజయవాడ, మార్చి31 :** కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు తీవ్రగాయాలయ్యాయి. మందుగుండు సామగ్రిని పోలీసులు బయట నుంచి తీసుకొచ్చి పీఎస్‌లో పరిశీలిస్తుండగా ఈ ఘటన చోటుచేసున్నట్లు సమాచారం. గాయపడిన వారిలో ఎస్సైతో పాటు పోలీసు వాహన డ్రైవర్ దుర్గాంజనేయులు, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు ధాటికి పీఎస్‌లోని ఫర్నిచర్, బయట నిలిపి ఉంచిన వాహనాలు దెబ్బతిన్నాయి. చల్లపల్లి సీఐ కేఎస్ రావు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. పీఎస్‌లో పేలుడు ఘటనపై రాష్ట్ర హోంమంత్రి అనిత స్పందించారు. జిల్లా ఎస్పీతో ఆమె మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయాలపాలైన పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని అనిత ఆదేశించారు.

## ఒకేసారి ఐదు లక్షల

## గ్యాస్ బుకింగ్‌లు

**గ్యాస్, డీజిల్, పెట్రోల్ సరఫరాపై అనేక అసత్య ప్రచారం**

**డీలర్లు, ఉన్నతాధికారులతో మంత్రి నాదెండ్ల సమీక్ష**

**సోషల్ మీడియా వదంతులను నమ్మొద్దని సూచన**

**విజయవాడ, మార్చి31 :** వదంతుల కారణంగా ఒకే సారి ఐదు లక్షల గ్యాస్ బుకింగ్‌లు కావడంతో ఇబ్బందులు తలెత్తాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోషల్ మీడియా ప్రభావంతో అనేక వదంతుల కారణంగా ప్రజల్లో గందరగోళం నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి వాటిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటూ ఆదేశాలు ఇస్తున్నారని గుర్తు చేశారు. ఎల్.పి.జి వినియోగదారులను పి.ఎన్.జి వైపు మళ్లించేందుకు తమ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.గ్యాస్, డీజిల్, పెట్రోల్ సరఫరాపై అనేక అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మంగళవారం గ్యాస్, ఆయిల్ డీలర్లు, ఉన్నతాధికారులతో మంత్రి నాదెండ్ల మనోహన్ సమావేశమయ్యారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. సరఫరా విషయంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. డొమెస్టిక్ గ్యాస్‌కు సంబంధించి 16 ఏజెన్సీల నుంచి డెలివరీ విషయంలో జాప్యం జరుగుతుందని వివరించారు. ఈ సమస్యలను వెంటనే నివారించాలని వారికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. బ్లాక్ మార్కెటింగ్ చేసే 146 గ్యాస్ ఏజెన్సీలపై సెక్షన్ 6 ఏ కింద కేసులు నమోదు చేశామని చెప్పారు. అందుకు సంబంధించి 4 వేలకుపైగా గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. మూడు ఆయిల్ కంపెనీలతో ప్రతిరోజూ మాట్లాడి గ్యాస్ కొరత లేకుండా చేస్తున్నామని తెలిపారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co